సహజీవన భావనల పావురాయి

# గీటురాయి


వారపత్రిక 19-4-2024 15/-



## మరోసారి వార్తల్లో మదరసాల చర్చ



నోరూరించే ద్రాక్ష...ఆరోగ్యానికి రక్ష



ఎన్నికల్లో ఈవీఎంల వాడకం

గీటురాయి వారపత్రిక
సహజీవన భావాల పావురాయి

GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 16 హైదరాబాద్
శుక్రవారం 19 ఏప్రిల్ 2024 రూ.15-00
9 షవ్వాల్ 1445 హిజ్రీ

**తొలిగీటు**

**తోటి సోదరుని తప్పులను చూపడానికి అతిగా అనుమానించడం పెద్ద తప్పు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షరీఫ్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



11

**అమ్మానాన్నలతో ఎలా ఉండాలి?**

## లోపల...


| | | |
|---|---|---|
| కచ్చతీవు రాజకీయం | ...... | 04 |
| మరోసారి వార్తల్లో మదరసాల చర్చ | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-25 | ...... | 08 |
| చరితార్థులు-2 : చింతపల్లి హుసేన్-జాన్ ముహమ్మద్ | ...... | 10 |
| నేటి అవసరం | ...... | 12 |
| నోరూరించే ద్రాక్ష...ఆరోగ్యానికి రక్ష | ...... | 14 |
| జాతిని కదిలించిన ఉద్యమ నినాదాలు | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| విరుద్ధ భాగాల పరస్పర సమరసం-3 | ...... | 20 |
| ఎన్నికల్లో ఈవీఎంల వాడకం | ...... | 23 |
| ప్రభావవంతులం అవ్వాలంటే... | ...... | 26 |
| ధీర వనితలు | ...... | 30 |
| అరుదైన సంస్కర్త అంబేద్కర్ | ...... | 32 |
| ప్రళయ దినం సంభవించిన రోజున... | ...... | 34 |


**గురితప్పిన బాణం...**




ఏమైందో ఏమోమరి
జగనొదిలిన బాణం
ఎదురు తిరిగి తన్నోనే
చేస్తున్నదోయి రణం!
నల్లుతోందట నడుమ
అమ్మగారు విజయమ్మ
అన్నాచెల్లెలు మధ్యన
పావైనదంట ఆయమ్మ!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# కచ్చతీవు రాజకీయం

**కాంగ్రెసు ప్రభుత్వం** పాలిస్తున్నప్పుడు 1970లో శ్రీలంకకు కచ్చతీవు దీవిని కాంగ్రెసు ప్రభుత్వం ఇచ్చేసిందని, జాతీయ ప్రయోజనాలకు దెబ్బకొట్టిందని ప్రధాని మోడీ ఇప్పుడు మండి పడుతున్నారు. 2014 ఎన్నికల్లో ఆయనకు ఈ విషయం తట్టలేదు, 2019 ఎన్నికల్లో కూడా ఈ విషయం తట్టలేదు. ఇప్పుడు 2024లో ఏదైనా కొత్త విషయం కనిపెట్టి ప్రజలకు చెప్పాలనుకున్నారేమో, చరిత్ర తవ్వి ఈ విషయాన్ని కనిపెట్టి ప్రజలకు చెప్పారు.

ఆ వెంటనే కాంగ్రెసు కూడా ఎదురుదాడి చేసింది. బంగ్లాదేశ్‌తో ప్రధాని మోడీ 2015లో ల్యాండ్ బౌండరీ ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందం వల్ల భారత భూభాగంలో 10,051 ఎకరాలు బంగ్లాదేశ్‌కు వెళ్ళాయని కాంగ్రెసు నాయకుడు జైరాం రమేష్ వివరించారు. కాంగ్రెసుపై విమర్శలు చేస్తున్న మోడీ తాను చేసిన ఘనకార్యమేమిటో కూడా వివరించాలని ఆయన విమర్శించారు.

కచ్చతీవు విషయంలో ఇప్పుడు గగ్గోలు చేస్తున్న బీజేపీ నేతలు చైనా విషయంలో ప్రధాని మోడీ వైఖరిపై మాత్రం కిమ్మనడం లేదు. ఇటీవల చైనా అరుణాచల్ ప్రదేశ్‌లోని 30 ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టి ఒక ప్రకటన చేసింది. అరుణాచల్ ప్రదేశ్ ను కూడా చైనా జాంగ్నాన్ అని చైనా భాష పేరుతోనే వ్యవహరిస్తుంది. ఇంతకుముందు 2023లో కూడా చైనా అరుణాచల్ ప్రదేశ్ లోని 11 ప్రదేశాల పేర్లు మార్చింది. భారత విదేశాంగ మంత్రి యస్.జైశంకర్ ఈ విషయమై చైనాను విమర్శిస్తూ ఒక ప్రకటన చేశారు. లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద భారతసైన్యాలున్నాయని చెప్పారు.

ఇప్పుడు చైనా ఈ ప్రదేశాల పేర్లు ఎందుకు మార్చిందని ఆలోచిస్తే, ఇటీవల నరేంద్రమోడీ అరుణాచల్ ప్రదేశ్‌లో నిర్మించిన ఒక సొరంగాన్ని ప్రారంభించడానికి అక్కడికి వెళ్ళారు. ఆ వెంటనే చైనా అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రదేశాల పేర్లు మార్చి అవన్నీ తమ భూభాగాలన్నట్లు వ్యవహరించింది. ఈ విషయమై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే మాట్లాడుతూ, ప్రధాని మోడీకి చైనా పాలకుడు జింగ్ పిన్‌కు మధ్య 19 సార్లు చర్చలు జరిగాయి కాని చైనాను ఏ ఒక్క విషయంలోను మోడీ ఒప్పించలేకపోయారని అన్నారు. డోక్లాం, గాల్వాన్ ఘర్షణల తర్వాత, లద్దాక్‌లో 2000 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని చైనా ఆక్రమించుకున్న తర్వాత, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఉత్తరాఖండ్‌లలో అనేక చోట్ల చైనా చొరబాట్ల సంఘటనల తర్వాత కూడా ప్రధాని మోడీ చైనా విషయంలో చాలా మెతగ్గా మాట్లాడుతున్నారన్నది ఒక వాస్తవం. మోడీ చైనా విషయంలో కళ్ళెర్రజేయడం లేదని ఖర్గే వ్యంగ్యంగా విమర్శించారు. చైనా అనేక విధాలుగా రెచ్చగొడుతున్నప్పటికీ పెదవివిప్పలేని మోడీ, చైనా మన భూభాగాలపై తిష్ఠవేసినా వెనక్కి తరమలేని మోడీ, బంగ్లాదేశ్‌కు భారత భూభాగాలు అప్పజెప్పిన మోడీ ఇప్పుడు కచ్చతీవు విషయంలో గగ్గోలు సృష్టించడం విచిత్రమని పలువురు భావిస్తున్నారు. కచ్చతీవు దీవిపై గగ్గోలు చేయడం ద్వారా జాతీయ ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నామని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయవచ్చు, తమిళ ప్రజల సెంటిమెంటును కూడా వాడుకోవచ్చన్నది బీజేపీ ఉద్దేశ్యమన్నది స్పష్టంగా కనిపిస్తోంది.

కచ్చతీవు విస్తీర్ణం కేవలం 300 ఎకరాలు. ఇక్కడ మానవ మాత్రులెవ్వరు లేరు. 1974లో ఈ దీవిని భారతదేశం శ్రీలంకల మధ్య సరిహద్దుల నిర్ధారణ క్రమంలో శ్రీలంకకు ఇవ్వడం జరిగింది. అప్పట్లో శ్రీలంకతో మన సంబంధాలు బాగుండేవి. తర్వాత తమిళ ఈలం కాలంలో సంబంధాలు దెబ్బతిన్నాయి. కచ్చాతీవు శ్రీలంకకు ఇచ్చిన ఇందిరాగాంధీ దానికి బదులుగా మత్స్యసంపద పుష్కలంగా లభించే వెడ్జ్ బ్యాంక్ భారతదేశానికి సంపాదించారు. ఇప్పుడు ఈ సమస్యను జాతీయ సమస్యగా ప్రస్తావించి బీజేపీ ఏం సాధించాలనుకుంటుంది? 2014లో అటార్నీ జనరల్ ముకుల్ రోహ్తగీ స్వయంగా సుప్రీంకోర్టులో ఈ దీవిని భారతదేశం స్వంతం చేసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. ఈ దీవిని తిరిగి సంపాదించడానికి ఈ పదేళ్ళ కాలంలో బీజేపీ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. శ్రీలంకతో ఈ విషయమై ఎన్నడూ మాట్లాడలేదు. తమిళనాడులో బహుశా రామనాథపురం నియోజకవర్గం మినహాయిస్తే మిగిలిన రాష్ట్రంలో కచ్చతీవు పట్ల ప్రజల్లో పెద్ద సెంటిమెంటు ఏదీ లేదు. తమిళనాడులో ఎలాగైన కాలుపెట్టాలని బీజేపీ ఎంత అల్లాడిపోతుందో ఈ ప్రయత్నాలు చూస్తే అర్థమవుతోంది.

★★★

అబ్దుల్ వాహెద్



# మరోసారి వార్తల్లో మదరసాల చర్చ

**ఉత్తరప్రదేశ్‌లో** మదరసా విద్యార్థులకు ఇప్పుడు కాస్త ఊరట లభించింది. ఉత్తరప్రదేశ్ మదరసా ఎడ్యుకేషన్ బోర్డు చట్టం రాజ్యాంగవిరుద్ధమైందంటూ హైకోర్టు ఆ చట్టాన్ని రద్దు చేసింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుతో ఉత్తరప్రదేశ్‌లో మదరసా విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంలా మారింది. ఇప్పుడు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కొంత ఊరట లభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జే.బి. పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ స్టే ఇచ్చింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై ఐదు స్పెషల్ లీవ్ పిటీషన్లు సుప్రీంకోర్టులోకి వచ్చాయి. వీటిని విచారిస్తూ సుప్రీంకోర్టు ఈ కేసులో హైకోర్టు పొరబడిందని, చట్టంలోని నిబంధనలను సరిగా అర్థం చేసుకోలేదని వ్యాఖ్యానించింది.

అసలు సుప్రీంకోర్టు కన్నా ముందు అలహాబాద్ హైకోర్టులో ఏం జరిగిందో ఒకసారి చూద్దాం.

అలహాబాద్ హైకోర్టు ఉత్తరప్రదేశ్ మదరసా ఎడ్యుకేషన్ చట్టాన్ని రద్దు చేయడం వల్ల దాదాపు 10వేల మంది మదరసా టీచర్లు, దాదాపు 26 లక్షల మంది మదరసా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యింది. ఈ విద్యార్థులందరినీ ఉత్తరప్రదేశ్‌లోని ఆదిత్యనాథ్ సర్కారు ప్రభుత్వ స్కూళ్ళలో చేర్పించాలని కోర్టు చెప్పింది. అందుకు అవసరమైన కొత్త స్కూళ్ళను ఏర్పాటు చేయడం, టీచర్లను నియోగించడం వగైరా చేయాలని చెప్పింది. ఇది జరిగే పనేనా? ఈ తీర్పు మార్చి 22వ తేదీన వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లో 16,513 మదరసాలున్నాయి. ఇందులో 560 ప్రభుత్వ ఎయిడ్ లభిస్తున్న మదరసాలు. 8400 కన్నా ఎక్కువగా ప్రభుత్వ గుర్తింపు లేని మదరసాలున్నాయి. హైకోర్టు తీర్పు వల్ల గుర్తింపు పొందిన మదరసాల్లో చదువుతున్న 19.5 లక్షల మంది విద్యార్థులు, గుర్తింపు లేని మదరసాల్లో చదువుతున్న 7 లక్షల మంది విద్యార్థుల చదువుకు సున్నా పెట్టినట్లయ్యింది.

ఇంతకీ మదరసాలపై ఈ వేటు ఎందుకు వేసారంటే, హైకోర్టు తీర్పులో చెప్పిందేమిటంటే, ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ఆధునిక విద్య, నాణ్యమైన విద్య లభించడం లేదంట. అది రాజ్యాంగంలోని ఉచిత నిర్బంధ విద్యా విధానానికి విరుద్దం అని పేర్కొంది.

మదరసాలపై ఈ ఫిర్యాదు చేసిందెవరన్నది కూడా ఒకసారి చూద్దాం. అంషుమన్ సింగ్ రాథోడ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజక వ్యాజ్యంపై హైకోర్టు ఈ తీర్పు చెప్పింది. ఈ అషుమన్ రాథోడ్ ఒక న్యాయవాది. ఈ కేసులో హైకోర్టు 86 పేజీల తీర్పు చెప్పింది. మదరసాల్లో విద్యా ప్రభుత్వ స్కూళ్ళలో విద్యతో పోల్చితే నాణ్యమైనది కాదని అభిప్రాయపడింది. మదరసాల్లో ఖురాను ఇస్లామీయ విద్యను అందిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఆల్ ఇండియా టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వహీదుల్లా ఖాన్ ఈ విషయమై ప్రతిస్పందిస్తూ మదరసాల్లో కేవలం ఇస్లాం గురించి బోధించడం మాత్రమే జరుగుతుందనడం పొరబాటని అన్నారు. కేవలం ఇస్లామీయ విద్యాబోధన జరుగుతున్నందువల్లనే గ్రాంట్లు ఇస్తున్నారనడం కూడా తప్పని చెప్పారు. మదరసాల్లో ఓరియంటల్ భాషలను బోధించడం జరుగుతోంది. ఓరియంటల్ భాషలంటే అరబీ, ఫార్సీ, సంస్కృతం వగైరా భాషలు. ఈ భాషలను బోధిస్తున్నందుకు గ్రాంట్లు ఇస్తున్నారు. వేదపాఠశాలలు కూడా దేశంలో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో వేద పాఠశాలలను ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహిస్తోంది. కాని ఉత్తరప్రదేశ్‌లో మదరసాల నిర్వహణ 1996 నుంచి మైనారిటీ వ్యవహారాల శాఖ చూస్తోంది. మొదట్లో అరబీ ఫార్సీ బోర్డు క్రింద ఈ మదరసాలు ఉండేవి. తర్వాత దాన్ని మదరసా బోర్డు క్రింద మార్చారు. మదరసాల్లో కేవలం ఇస్లాం గురించి బోధించడం మాత్రమే కాదు ఈ ప్రాచ్యభాషలను బోధించడం కూడా జరుగుతుంది. అంతేకాదు, ప్రభుత్వ స్కూళ్ళు చేరుకోలేని ప్రాంతాల్లో కూడా మదరసాలు చాలా కాలంగా నడుస్తు పిల్లలకు విద్యను అందిస్తున్నాయి. కోర్టు తీర్పు తర్వాత టీచర్లకు జీతాలు దొరకని పరిస్థితి, పిల్లలకు చదువు ఆగిపోయిన పరిస్థితి. వేలాది టీచర్లు, లక్షలాది విద్యార్థులు. పైగా ఈ తీర్పులో మదరసాలపై వేటు వేయాలన్నదే ముఖ్యంగా కనబడుతుంది. ఒకవేళ ఈ చట్టంలో రాజ్యాంగానికి విరుద్ధమైన అంశాలుంటే చట్టాన్ని సంస్కరించేలా సూచనలు ఇవ్వవచ్చు కదా. మదరసా లపై వేటు వేయడం ఎందుకు అనే ప్రశ్నలు చాలా మంది వేశారు. పైగా ఈ లక్షలాది మంది విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్ళలో చేర్చాలని చెప్పడం విచిత్రం. ఎందుకంటే, ప్రభుత్వ స్కూళ్ళలో సదుపాయాల కొరత, టీచర్ల కొరత, భవనాల కొరత వంటి అనేక సమస్యలున్నాయి. నిజానికి చాలా మదరసాల్లో విద్యార్థులకు ఉచిత విద్య మాత్రమే కాదు, భోజన సదుపాయం, వైద్యసదుపాయాలు కూడా కల్పిస్తారు. 2018 తర్వాతి నుంచి ఉత్తర్ ప్రదేశ్ మదరసాలు ఎన్సీయిఆర్టీ సిలబసును కూడా అనుసరిస్తున్నాయి.

మదరసాలు నాణ్యమైన విద్యను అందించడం లేదనడం కూడా సత్యదూరం. మదరసాల్లో చదువుకున్న వాళ్ళు సివిల్స్ రాసి ఉత్తీర్ణులవుతున్నారు. ఐఏయస్ అధికారులవుతున్నారు. న్యాయవాదులుగా, డాక్టర్లుగా ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు. అలాంటి చాలా ఉదాహరణలున్నాయి. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, జామియా మిల్లియా ఇస్లామియా వంటి అనేక యూనివర్శిటీల్లో మదరసాల్లో చదువుకున్న విద్యార్థులు ప్రొఫెసర్లుగా కూడా కనిపిస్తారు. అలహాబాద్ హైకోర్టు తీర్పులో పేర్కొన్న అనేక అంశాలను చాలా మంది విమర్శించారు.

స్వాతంత్ర్యం తర్వాత ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటు మదరసాలు అలాగే చాలా కాలం కొనసాగాయి. ప్రభుత్వం వాటిని రెగ్యులేట్ చేయడం లేదా గుర్తింపునివ్వడం జరగలేదు. 1969లో మొదటి సారి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నియమాలు రూపొందించింది. “రూల్స్ ఆఫ్ రికగ్నిషన్ ఆఫ్ అరబిక్ అండ్ పర్షియన్ మదరసాస్, ఉత్తరప్రదేశ్” నిబంధనలు వచ్చాయి. ఆ తర్వాత 1987లో ఈ విద్యాసంస్థలను రెగ్యులేట్ చేయడానికి శాసనేతర నిబంధనలను మరోసారి రూపొందించారు. 1995లో మైనారిటీ సంక్షేమ శాఖ ఏర్పడింది. అప్పుడు మదరసాలు ప్రభుత్వ విద్యాశాఖ క్రింద ఉన్నాయి. మైనారిటీ సంక్షేమ శాఖ ఏర్పడిన తర్వాత మైనారిటీలకు సంబంధించిన పథకాలతో పాటు మదరసాలను కూడా ఈ శాఖ నిర్వహణలోకి తెచ్చారు. ఆ తర్వాత 2004లో మదరసా చట్టాన్ని తీసుకువచ్చారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి కొనసాగుతున్న మదరసా విద్యను రెగ్యులేట్ చేసే ప్రయత్నాలే ఇవన్నీ. కాని అకస్మాత్తుగా అలహాబాద్ హైకోర్టు మదరసాలపై వేటు వేసింది.

ఇప్పుడు సుప్రీంకోర్టు ఈ తీర్పుపై స్టే విధించింది. మదరసాల వల్ల దేశంలో లౌకికవాదం దెబ్బతింటుందన్న అభిప్రాయం తప్పని సూటిగా చెప్పింది. హైకోర్టు తీర్పు వల్ల లక్షలాది

విద్యార్థుల చదువు దెబ్బతింటుందన్న వాస్తవాన్ని కూడా ఉన్నత న్యాయస్థానం గుర్తించింది. మదరసాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన చదువు లభించాలన్నదే అసలు ఉద్దేశ్యమైతే అందుకు అవసరమైన ఉత్తర్వులు ప్రభుత్వానికి ఇస్తే సరిపోయేదని, చట్టాన్ని రద్దు చేయవలసిన అవసరం ఏముందని కోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు తీర్పును అనేకమంది స్వాగతించారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యుడు మౌలానా ఖాలిద్ రషీద్ ఫారంగీ మహాలీ హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి మదరసాలను లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. మదరసాలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో విచారించడానికి యోగీ ప్రభుత్వం ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమును ఏర్పాటు చేసింది. గత మూడు సంవత్సరాలుగా ఉత్తరప్రదేశ్‌లోని 80 మదరసాలకు దాదాపు 100 కోట్ల రూపాయల విదేశీ నిధులు అందాయని వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే మదరసా బోర్డ్ చట్టంపై ప్రజాప్రయోజక వ్యాజ్యం రావడం, వెంటనే అలహాబాద్ హైకోర్టు ఆ చట్టాన్నే రద్దు చేసి, మదరసా విద్యార్థులు, ఉపాధ్యాయుల భవిష్యత్తును అయోమయానికి గురి చేయడం వంటి సంఘటనలు జరిగాయి.

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మదరసాలపై కత్తికట్టిందన్నది అందరికీ స్పష్టంగా కనబడుతున్న వాస్తవం. దాదాపు 4000 మదరసాలకు విదేశీనిధులు అందుతున్నాయని ఒక వార్త ప్రచారంలో పెట్టారు. చాలా మదరసాలకు చట్టబద్ధమైన పత్రాలేవీ లేవని కూడా వార్తలు ప్రచారంలో పెట్టారు. మదరసాలు పూర్తిగా విరాళాలపై నడుస్తాయి. ముఖ్యంగా జకాత్ ద్వారా, సదకాల ద్వారా లభించే నిధులతో నడుస్తాయి. చాలా మదరసాల్లో టీచర్లకు ఆరేడు నెలల వరకు జీతాలు లభించని పరిస్థితి కూడా ఉంటుంది. అయినా మదరసాలను నడపడం ఒక సంప్రదాయంగా విద్యాకార్యక్రమంగా ముస్లిం సముదాయంలో కొనసాగుతోంది. ఈ సంవత్సరం జనవరిలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మదరసాల్లో ఆధునిక సబ్జెక్టులు బోధిస్తున్న టీచర్లకు గౌరవవేతనాన్ని రద్దు చేసింది. నిజానికి ఈ స్కీము కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్కీము. ఉత్తరప్రదేశ్ లోని 7742 మదరసాల్లో 21 వేల మంది టీచర్లను నియమించి ఆధునిక శాస్త్రాలను బోధించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన స్కీము. ఆ తర్వాత ఈ స్కీమును అటకెక్కించారు. నిధులు విడుదల చేయడం ఆపేశారు. చివరకు రాష్ట్రప్రభుత్వం కూడా గౌరవవేతనాలు ఆపేస్తున్నామని తెలియజేసేసింది. గత సంవత్సరం అక్టోబరులో వచ్చిన వార్త ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని మదరసాలు సంబంధిత పత్రాలు చూపించాలని లేదా రోజుకు పదివేల రూపాయల జరిమానా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

విచిత్రమేమిటంటే, మదరసాలపై కత్తికట్టిన యోగీ ప్రభుత్వం వాస్తవాలు ముందుకు వచ్చిన తర్వాత మదరసా బోర్డు చట్టం రద్దు చేయడాన్ని వ్యతిరేకించక తప్పలేదు. ఎందుకంటే, హైకోర్టు తీర్పు తర్వాత దాదాపు 17 లక్షల మంది మదరసా విద్యార్థులకు ప్రభుత్వ స్కూళ్ళలో అవకాశం కల్పించడమంటే 1096 కోట్ల రూపాయల ఖర్చు రాష్ట్రప్రభుత్వం భరించవలసి వస్తుంది. అందువల్ల హైకోర్టు తీర్పుపై స్టే కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా ప్రయత్నించింది. దేశంలో గురుకులాలు ఉన్నాయని, సంస్కృత పాఠశాలలు నడుస్తున్నాయని కాబట్టి సెక్యులరిజానికి వచ్చిన నష్టమేమీ లేదని వాదించారు. గమనించవలసిన మరో విషయమేమిటంటే, మరో వార్త ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతుంది. యోగీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మదరసాల లైసెన్సులు రద్దు చేసిందని, ఈ మదరసాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వ స్కూళ్ళకు వెళ్ళవలసిందేనన్నది ఆ వార్త. ఏది ఏమైనా ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ రాజకీయమంతా మదరసాల చుట్టే తిరుగుతున్నట్లు కనిపిస్తోంది.

✤


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

అధ్యాయం -8

25

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

### సంస్కరణలు, విధానాలు

ఆయన తన కాలంలో ప్రవేశ పెట్టిన సంస్కరణలు, సరికొత్త విధానాలు నేటికీ పరిపాలనకు ఊపిరిపట్టుగా అలరారు తున్నాయి. అవి చాలా విస్తారంగా ఉన్నాయి. కాని క్లుప్తంగా కొన్నింటిని మాత్రం పరిశీలిద్దాము.

- న్యాయస్థానాల స్థాపన, న్యాయమూర్తుల నియామకం.
- తేదీల వ్యవస్థ, హిజ్రీ శతాబ్ది నిర్ణయం.
- సైనిక కార్యాలయాలు, సైనిక వాసాల స్థాపన, ఆయుధా గారాల నిర్మాణం. సిపాయీల వేతనాల నిర్ణయం.
- సేద్యపు భూముల సర్వే.
- కొత్త నగరాల స్థాపనా ప్రణాళి.
- జనసంఖ్య సర్వే.
- సాగు నీటి సరఫరా వ్యవస్థ సంస్థాపన.
- కాలువల నిర్మాణం.
- పన్నులు వసూలు చేసే విభాగాల స్థాపన.
- కారాగార వాసాల నిర్మాణం, శిక్ష పొందిన వారి పోషణ.
- కొరడా శిక్ష.
- పోలీసు విభాగం స్థాపన.
- రహస్య సమాచార అధ్యయనం, పత్రకారుల నియామకం.
- అనాథాశ్రమాల వ్యవస్థాపన.
- నగరంలో వస్త్రాలు, అతిథి గృహాల నిర్మాణం.
- పాఠశాలల నిర్మాణం, అధ్యాపకుల నియామకాలు.
- నిరుద్యోగులకు నిత్యావసరాల పంపిణీ ఏర్పాటు.
- వక్ఫ్ లేదా ధర్మాదాయ సంస్థ విధానం, దాని విభాగం స్థాపన.

### అమరగతి

ముగైరా బిన్ షూబా వద్ద ఫీరోజ్ అనే ఓ ఈరానీ బానిస ఉండేవాడు. అతను కొంత ధనం చెల్లించి విడుదల పొందాలని కోరుకున్నాడు. తదనుగుణంగా రోజూ రెండు దిర్హములు చెల్లించే వాడు. అతను మహనీయ ఉమర్ ఫారూక్‌తో, ముగైరా తన వద్ద వసూలు చేసే ధనం ఎక్కువగా ఉందని ఫిర్యాదు చేశాడు. ఎలా సంపాదిస్తున్నావని ఆయన

అడిగారు. నిర్మాణ పనులు, నగిషి పనులు, కమ్మరి పనులు చేసి అని అతను చెప్పాడు. దానికి ఆయన, "ఇటువంటి మంచి ఆదాయం ఉన్న పనులు చేసే వ్యక్తి రెండు దిర్హ ములు సులువుగా ఇవ్వ గలడుగా" అన్నారు.

ఒకరోజు ఆయన ఫజ్ర్ నమాజ్ చేయిస్తూ ఉండగా ఫీరోజ్ ఆయన పై కత్తితో ఆరు వేట్లు వేశాడు. ఆయన వెంటనే పడి పోయారు. దాడి చేసిన వారెవరని అడిగితే జనులు పేరు చెప్పగానే, "దైవానికి కృతజ్ఞతలు, నా హంతకుడు ముస్లిమ్ కాడు" అని పలికారు. ఆయన్ని ఇంటికి తీసుకు వెళ్లి మందు త్రాపించారు కాని ప్రయోజనం లేక పోయింది. మహనీయ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర) నమాజ్ చేయించారు. ఫీరోజ్‌ని పట్టుకున్నప్పుడు అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

మహనీయ ఉమర్ తన తనయుడు అబ్దుల్లాని మహనీయ ఆయిషా వద్దకు పంపి, ప్రవక్త మహనీయుల సమాధి సమీ పంలో తనకు ఖననం చేసేందుకు చోటు ఇవ్వ గలరేమో అడగమన్నారు. ఆవిడ, "ఆ చోటు నా కొరకు కావాలని అను కున్నాను, అయినా నాకన్నా ఉమర్ గారికి ప్రాధాన్యత ఇస్తాను" అని పలికారు. ఆ శుభ సమాచారం ఆయనకు తెలిపినప్పుడు, "నా పెద్ద కోరిక అదే" అని అన్నారు.

### ఆయన పిదప ఎవరూ?

మహనీయ ఉమర్ ఇక కోలుకోలేరని సహచర మాన్యులు గ్రహించి ఆయన్ని అభ్యర్థించారు, ఎవరినయినా ఖలీఫాగా నామకరణం చేయాలని. దానికి ఆయన కొంత తటపటా యించారు, "నేను ఎవరినయినా ఖలీఫాగా నియమించినా అది తప్పు కాదు, ఎందుకంటే అబూ బక్ర్, నాకంటే ఎంతో ఉన్నతులు, ఇలా చేశారు. అలా చేయకపోయినా తప్పు కాదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు ఎవరినీ ఖలీఫాగా నియమించ లేదు. అయితే అబూ ఉబైదా బిన్ జర్రాహ్ బ్రతికి ఉంటే ఆయన్ని నియమించే వాణ్ణి. ఎందుకంటే దైవం ప్రశ్నించినా చెప్పే వాణ్ణి, నీ ప్రవక్త ద్వారా విన్నాను, ఆయన ఈ సముదాయం అమీన్ (నమ్మకస్తుడు) అని. లేదా అబూ హుజైఫా బానిస సాలిమ్ బ్రతికి ఉంటే అతన్ని ఖలీఫాగా నియమించే వాణ్ణి, దైవానికి విన్నవించుకునే వాణ్ణి, నేను నీ ప్రవక్త ద్వారా విన్నాను, సాలిమ్ కేవలం దైవం కొరకే అంకితం అయిన వ్యక్తి అని".

వ్యవహారం చాలా ప్రముఖమయింది అందువల్ల సహచర మాన్యులు మరో సారి ఆయన్ని వేడుకున్నారు. ఆయన, "నేనెవరినయినా ఎన్నుకోవాలని అనుకున్నాను. కాని నేను మరణించిన తరువాత కూడా ఆ పని బాధ్యత నా పైనే ఉంటుందన్న భయం చేత నా సంకల్పం ముగిసి పోయింది. ఇంతకూ ఇదో ఆరు పేర్లు చెబుతున్నాను, మహనీయులు ఉస్మాన్, అలీ, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, సఅద్, జుబైర్, ఇంకా తల్హా. వీరిలో ఒకరిని ఎన్నుకోవాలని. వీరి పట్ల ప్రవక్త మహనీయులు సంతోషం కలిగి ఉండేవారు. మరి నేనయితే ప్రవక్తశ్రీ తన చివరి శ్వాస వరకు సమ్మతి కలిగి ఉన్న వారి కన్నా ఖలీఫాగా అర్హులయిన వారున్నారని నేననుకోను" అన్నారు.

ఆ తరువాత ఆయన అబూ తల్హా, మిక్దాద్ బిన్ అస్వద్‌ను పిలిపించి ఇలా అన్నారు, "మీరు తమ వెంట 49 మంది అన్సారుల్ని తీసుకుని ఖలీఫా ఎన్నిక జరుగుతున్న ఇంటి గడప వద్ద కాపలా కాయడం మీ బాధ్యత. మూడు రోజుల్లో ఈ పెద్దలు తమలో నుంచి ఒకరిని ఖలీఫాగా ఎన్నుకోవడం తప్పనిసరి. మీ బాధ్యత ఏమిటంటే ఎన్నిక జరగనంత వరకు బయటి నుంచి ఎవరినీ వారి వద్దకు వెళ్ళనివ్వరాదు. వీరిలో ఎవరి పట్ల ఎక్కువ మంది నమ్మకం కనబరుస్తారో ఆయనే ఖలీఫా అవుతారు. ఎవరయినా దీన్ని వ్యతిరేకిస్తే అతన్ని చంపి వేయండి".

ఆయన గాయాలు తగిలిన మూడవ రోజు, హిజ్రీ 23వ సంవ త్సరం, జిల్ హజ్జ 27వ తారీఖున, బుధవారం సాయంత్రం పరమపదించారు. గురువారం ఉదయం ప్రవక్త శ్రీ ప్రక్కన ఖననం చేయడం జరిగింది. మహనీయ సుహైబ్ నమాజ్ చేయించారు. అప్పుడు ఆయన వయస్సు 63 ఏండ్లు.

రజియల్లాహు తఆలా అన్హు! ❑

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# 'చరితార్థులు'-2



# చింతపల్లి హుసేన్-జాన్ ముహమ్మద్

( -1920)

42




మహాత్ముని పిలుపుతో భారతదేశమంతటా ప్రజ్వరిల్లిన సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలోని పల్నాడు గడ్డ నుండి కన్నెగంటి హనుమంత నాయకత్వంలో సాగిన పుల్లరి ఉద్యమంలో అందరి కంటె ముందుగా చింతపల్లి హుస్సేను, జాన్ మహమ్మద్, నబీ సాహెబ్‌లు అరెస్టయ్యి చరిత్ర సృష్టించారు. ఆనాటి సంఘటనలకు స్వయం సాక్షిగా నిలచిన మాదల వీరభద్రరావు తన గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం 1920–30 ఉజ్వల ఘట్టాలు గ్రంథంలో పుల్లరి ఉద్యమంలో ముస్లింలు నిర్వహించిన పాత్రను వివరించారు. మాచర్లకు పొరుగు గ్రామమైన కొత్తపల్లికి చెందిన మహమ్మదీయులలో ముగ్గురు ఉద్యమకారులు పుల్లరి చెల్లింపును వ్యతిరేకిస్తూ, సహాయనిరాకరణ ఉద్యమానికి తోడ్పడుతూ, పుల్లరి ఉద్యమకారులకు అనుకూలంగా గూఢచర్యం నిర్వహించి 'మొట్టమొదటిసారిగా' అరెస్టులకు కూడా గురయ్యారని పేర్కొన్నారు. 'ఆ గ్రామవాసులు ముగ్గురు మహమ్మదీయులు, (1) నబీ సాహెబ్, (2) చింతపల్లి హుస్సేన్ సాహెబ్, (3) జాన్ ముహమ్మద్ అనువారలు చారులుగా పని చేయచుండిరి. నబీ సాహెబు మిగుల ఉత్సాహపరుడు, సమర్థుడు, ముగ్గురు మంచివారు', అని ఆయన ఆ గ్రంథంలో వివరించారు. పుల్లరి వసూలుకు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులను అటకాయించినందున వారికి కోర్టు ఆరు మాసాల జైలు శిక్షను విధించింది. సత్యాగ్రహ యోధులైన ఆ ముగ్గురు ఎంతో ధైర్యంతో, పోలీసులన్నా, శిక్షలన్నా భయం లేకుండా ప్రవర్తించారు. ఆ యోధులు కోర్టుకు వచ్చిన తీరు, శిక్ష ప్రకటించిన తరువాత వారు ప్రదర్శించిన ధైర్యం గురించి మాదల వీరభద్రరావు ప్రస్తావిస్తూ, 'ఉదయం 11 గంటలకు మహమ్మదీయ ముద్దాయిలను గుర్రములపై నెక్కించుకుని పెండ్లికొడుకుల వలె హసన్, హుస్సేన్ మేళతాళములతో కోర్టుకు వచ్చిరి... ముగ్గురు ముద్దాయిలు తాము నేరము చేయలేదనియు, కేసు విచారణలో తాము పాల్గొనమనియు స్టేట్‌మెంట్లు దాఖలు చేసి క్రాస్ యగ్జామినేషన్ మొదలగునవి చేయక యూరకుండిరి ...విచారణ పూర్తయి...6 నెలల శిక్ష విధించబడెను...ముద్దాయిలను ఆ సాయంత్రం ఖయిదులో చూసితిని. ధైర్యముగానున్నారు... మూడు మాసాలలో స్వతంత్రం వచ్చును. మనమందరము విడిపింపబడుదమని చెప్పితిని... వారి కుటుంబములు బీదవి. మాచర్ల వారిని చందాలు వేసుకుని వారి కుటుంబాలను పోషింపవలయునని తెలియచేసితిని, వారట్లు చేయుదుమని చెప్పిరి.' అని గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం 1920–30 ఉజ్వల ఘట్టాలు (పుటలు 63–64) అను తన గ్రంథంలో శ్రీ మాదాల వీరభద్రరావు వివరిస్తూ 'పల్లాటి పుల్లరి సత్యాగ్రహంలో మొదట అరెస్టు అయిన మాచర్ల ముస్లిం దేశ భక్తులు' అంటూ చింతపల్లి హుస్సేను, జాన్ మహమ్మద్ చిత్రాలను, వివరాలను అందజేశారు. ★




**9440241727**


బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# అమ్మానాన్నలతో ఎలా ఉండాలి?

**- పోలంకి విజయభాస్కర్**

అమ్మ... నాన్న...రెండు అక్షరాల పదాల కలయికే తల్లిదండ్రులు. జన్మనిచ్చిన, సృష్టికి జీవం పోసిన తల్లిదండ్రులకు కొందరు కడుపుకోత మిగల్చగా, మరికొందరు ఆప్యాయంగా చూసేవారు, మరికొందరు అనాధాశ్రమంలో చేర్పించడం, ఇంకొందరు చంపడానికి కూడా వెనుకాడని పరిస్థితి నేడు అందరం కళ్ళారా చూస్తున్నాం. తల్లి గర్భం దాల్చినప్పటి నుంచి తన పిల్లలను కడుపులో నవమాసాలు మోసి బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తే, మన వేలు పట్టుకుని తప్పొప్పు లను సరిచేస్తూ దిశా నిర్దేశం చేస్తూ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తే నాన్న.

పుట్టినప్పటి నుంచి చచ్చేవరకు ఏ ఒక్క చిన్న బాధ కలిగినా ఓర్చుకోలేని వారే తల్లిదండ్రులు. కొవ్వొత్తి తాను కరిగిపోతూ లోకానికి ఎలా వెలుగునిస్తుందో అలాగే ప్రతి తల్లి, తండ్రి అనేక బాధలతో కష్టాన్ని పంటి కిందనే దాచుకొని కరిగిపోతూ కుటుంబానికి, సంతా నానికి సుఖాలను అందిస్తారు. నాన్న అంటే ధైర్యం.. నాన్న అంటే భద్రత... నాన్న అంటే భరోసా.

క్యాలెండర్ ప్రపంచంలో సంవత్సరంలోని ప్రతి నెలలో ప్రతి రోజుకు ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రతి సంవత్సరం జులై 23న జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం జరుపు కుంటారు. పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ అపూర్వమైనది, అసాధారణ మైనది. బిడ్డల కోసం తల్లిదండ్రులు అహర్నిశలు శ్రమించి తాము కడుపులు కాల్చుకుని బిడ్డల కడుపు నింపే తల్లిదండ్రులు ఎంతో ధన్యజీవులు. పుణ్యమూర్తులు. పుట్టినది మొదలుకొని లాలించి, బుజ్జగించి, ముచ్చటించి పెంచి పోషించేది తల్లిదండ్రులే. అలాంటి తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడం ఏ బిడ్డకు సాధ్యంకాదు. తల్లిదండ్రు లను బిడ్డలు వృద్ధాప్యంలో విడువక ప్రేమానురాగాలతో చూసుకోవలసిన బాధ్యత ప్రతి బిడ్డపై ఉంది. అయితే నేటి సమాజంలో కొందరు తమ తల్లిదండ్రులు బిడ్డల ప్రేమలకు, ఆదరణకు దూరం కాబడి నిరాదరణకు గురికాబడి అనాధాశ్రమంలోనూ దిక్కులేని వారిగా జీవిస్తూ తమ జీవితా లను కొనసాగిస్తున్నారు. తల్లిదండ్రులు లేనిది సృష్టిలేదు. సృష్టి లేకపోతే మానవజాతి లేదు. తల్లిదండ్రులను ప్రేమించే ప్రతి ఒక్కరికీ జాతీయ తల్లిదండ్రుల దినోత్సవ శుభాకాంక్షలు.

తల్లి జన్మనిస్తే... ఆ జన్మకు సార్థకత చేకూర్చి అంతవరకు శ్రమించే వ్యక్తి తండ్రి. ప్రేమ లేని అమ్మ, బాధ్యతలు లేని నాన్న దేశంలో ఎక్కడా ఉండరు. ఈ లోకంలో మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళు ఉండవచ్చు గానీ ప్రేమ లేని అమ్మ, బాధ్యత లేని నాన్న ఉండరు. పిల్లల ప్రతి మలుపులో ప్రతి బాధలో, గెలుపులో తోడుగా నిలిచేది తల్లిదండ్రులే. పిల్లలు పెద్దవుతున్న కొద్దీ పెద్దవాళ్ళు చిన్నపిల్లలుగా మారిపోతుం టారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా బిడ్డలు వదిలి వెళ్ళిపోతుంటే ఒంటరిగా బతకలేక తల్లిదండ్రులు కఠిన పరీక్షలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వారు పిల్లలతో ఉందామని ఆశపడతారు. కానీ వారి కోరిక నెరవేరదు. దీంతో మానసిక వ్యాధికి గురవుతుంటారు.

ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవాన్ని 2012లో యూఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానం చేసింది. తల్లిదండ్రుల దినోత్స వాన్ని నిర్వహించాలన్న ప్రతిపాదన అమెరికాలో మొదలైంది. 1984లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ అధికారికంగా ఈ దినోత్సవానికి ఆమోదముద్ర వేశారు. దీంతో అప్పటినుంచి తల్లిదండ్రుల దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు నిర్వహిస్తున్నాయి. వివిధ దేశాల్లో ఈ దినోత్సవాన్ని వేర్వేరు తేదీల్లో జరుపుకుంటారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రు లను పిల్లలు అనాధ శరణాలయాలలో వదిలేసే పరిస్థితి నెలకొంది. జీవన విధానాలు మారుతున్నాయి. కాబట్టి అందరూ తల్లిదండ్రులను విడిచి బ్రతుకు కోసం ఇతర ప్రాంతాలకు, విదేశాలకు వెళుతున్నారు. కానీ తల్లిదండ్రులకు 65 సంవత్సరాలు నిండిన తర్వాత పిల్లలు తల్లిదండ్రుల దగ్గరకు వచ్చి చూసుకుంటే... కన్న తల్లిదండ్రుల ఆశ నెరవేర్చిన వారు అవుతారు. తల్లిదండ్రుల కోసం ఏడాదికి ఏదో ఒక రోజు కాదు, ప్రతి రోజూ అమ్మానాన్నలతో ప్రేమగా ఉంటూ వారిని చూసుకోవడం పిల్లల బాధ్యత. తల్లిదండ్రు లను వృద్ధాప్యంలో ప్రేమగా చేసుకున్న సంతానా నికి దైవ ప్రసన్నత లభిస్తుందని ఇస్లాం చెబుతోంది. ❑

**మదీహా అర్జుమంద్**



# నేటి అవసరం

## దయాగుణమే సమాజానికి జీవనాడి

ఈనాడు సమాజంలో ఎటుచూసినా స్వార్థం, స్వలాభం, అమానవీయం, అరాచకం, అమానుషం రాజ్యమేలుతున్నాయి. దయ, జాలి, కరుణ, మంచి, మర్యాద, మానవత్వం మచ్చుకైనా కానరావడం లేదు. మనిషి దయాగుణాన్ని వీడి నిర్దయుడుగా, కఠిన మనస్కుడుగా ప్రవర్తిస్తున్నాడు. యాంత్రికమైపోయిన జీవన విధానంలో మనిషి ఒత్తిడికి గురవుతూ సులభ మార్గాలను అన్వేషిస్తున్నాడు. స్వార్థం, సంకుచితత్వం పెరిగిపోయింది. మానవ సంబంధాలు కాస్తా ఆర్థిక సంబంధాలుగా మారిపోవడం మూలాన మనుషుల్లో దయాగుణం కనుమరుగై పోతున్నది. అందుకే ప్రతి ధర్మమూ దయ, కరుణ, జాలి, మానవత్వంలాంటి ఉన్నత గుణాలను బోధించింది. దయాగుణం లేని మనిషి ఎన్ని ధ్యాన జపాలు, నమాజులు చేసినా నిరుపయోగమే అంటారు పెద్దలు. దయాగుణం వల్ల సంబంధాలు మెరుగుపడతాయి. సోదరభావం, ఐకమత్యం ఏర్పడుతుంది. ఆయుష్షు పెరుగుతుంది. ఎవరి మనసులోనైతే దయాగుణం లేదో వారిలో మానవత్వమే లేదన్నారు ముహమ్మద్ ప్రవక్త (స).

మనసులో దయాగుణం, మానవీయ స్పందనలు ఏ మాత్రం ఉన్నా మనిషి దుర్మార్గాలకు దూరంగా ఉంటాడు. అలాంటి వారిలో కారుణ్యం తప్పకుండా ఉంటుంది. బాధితుల పట్ల దయ, కనికరం చూపటం, కులమతాలకు అతీతంగా మనుషులందరినీ సమానంగా ప్రేమించగలగడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, అనాథలను, అన్నార్తులను ఆదరించడం, అక్కున చేర్చుకోవడం, ఇతరుల్ని బాధించకపోవడం, హింసించక పోవడం, ఇతర మతస్తులను, మతధర్మాలను ఆదరించడం, గౌరవించడం తదితరాలు. మొత్తంగా చూస్తే దయాగుణం అన్నది మనసులో ప్రేమానురాగాల భావనను జనింపజేస్తుంది. వసుధైక కుటుంబ భావనను ప్రోది చేస్తుంది. దయ, జాలి, మానవీయతకు ఆలంబనగా నిలిచే ప్రధాన సుగుణం సహనం. సహనం సామాజిక శాంతికి దోహదపడుతుంది. మనిషిలోని అసహనం కల్లోలానికి కారణమవుతుంది. శాంతియుత నైతిక జీవనం సాగించేందుకు సహనం తప్పనసరి. అదే దయాగుణపు మానవీయ లక్షణం. దయకూ, ప్రేమకూ, మానవతాతత్వంలో ఎంతో ముఖ్యమైన స్థానం ఉంది. పరస్పర మానవ సంబంధాలు, పరస్పర సహాయ సహకార భావన, పరస్పర అవగాహన నుంచి వచ్చేదే నిజమైన దయ, ప్రేమ. ఇదే మనిషిలోని ఆటవిక ప్రవృత్తిని ధ్వంసం చేసి, స్వార్థాన్ని నిర్మూలించి మనిషిని మనిషిగా, దయాగుణ సంపన్నునిగా, మానవతా వాదిగా నిలబెడుతుంది. దయాగుణం ఐక్యతను కూడా పెంపొందిస్తుంది. దయ, ప్రేమ, సహనం వల్ల ఐక్యత పెరుగుతుంది. కానీ ప్రస్తుత మానవ సమాజంలో కొరవడింది ఇదే. 'భువిపై ఉన్నవారిపట్ల దయ జూపండి దివి

పై వాడు మిమ్మల్ని కరుణిస్తాడు' అన్న ప్రవక్త మహనీయులవారి ఒక్క ప్రవచనాన్ని అర్థం చేసుకుంటే ఇహ పర లోకాల్లో సాఫల్యం మన సొంతమవుతుంది. కనుక మానవ మస్తిష్కాల్లో పెరిగిపో తున్న స్వార్థ చింతనను తగ్గించి, దయ, జాలి, కరుణ, సహనం లాంటి సుగుణాలను జనింపజేయాల్సిన అవసరం ఉంది.

## శాంతీ సామరస్యం వెల్లివిరియాలి

ఈనాటి మానవుడు విద్యా, విజ్ఞానాలు, పదవి, అధికారం, హోదాల పరంగా ఎంత ప్రగతి సాధించినా, నైతిక, సామాజిక, ఆధ్యాత్మికతల పరంగా తిరోగమనంలోనే పయనిస్తున్నాడు. నేడు సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, సద్భావన, మానవీయ విలువలు అడుగంటి పోతున్నాయి. అశాంతి, అలజడులు, అనుమానం, అభద్రతాభావం, అమానవీయం తాండవ మాడుతున్నాయి. కులం పేరుతో, మతం పేరుతో ఉన్మాదం పెరుగుతోంది. సంకుచిత మనస్తత్వం, కులతత్వం, మతోన్మాదం, మూకోన్మాదం దేశంలో పెచ్చరిల్లుతోంది. మంచి, మానవత్వం, శాంతీ, ప్రేమ, సదాచారం, సద్భావన మంటకలిసి పోతున్నాయి. నిజానికి మంచి, మానవత్వానికి మించిన ధర్మం మరొకటిలేదు. మానవత్వాన్ని మంటగలుపుతూ, ధర్మాన్ని రక్షిస్తున్నామనుకోవడం కంటే మూర్ఖత్వం మరొకటి ఉండదు. దేవుని పేరుతో దానవత్వం మానవతకు వ్యతిరేకం. భువిపై మానవ ఉనికి మానవత్వాన్ని కాపాడడానికి, సమాజంలో సామ రస్యాన్ని, సద్భావనను పెంపొందించడానికేనని ధర్మం చెబు తోంది. మానవీయ విలువల కోసం పాటుబడే వారికి ప్రతిఫలం ప్రసా దించే దైవం, శాంతీ, సామరస్యాలకు తూట్లు పొడుస్తూ మానవత్వాన్ని ఖూనీ చేసేవారిని ఊరికే వదలడు.

ఎప్పుడైతే మానవుడు సాటిమనిషి గురించి ఆలోచించడం, అతని యోగ క్షేమాలు పట్టించుకోవడం, సత్సంబం ధాలు నెరపడం, సద్భావనతో, సామ రస్యంతో మసలుకోవడం మానేశాడో అప్పుడే సమాజం పెడద్రోవ పట్టింది. మానవ హృదయంలో అతి పవి త్రంగా ఉండవలసిన మానవత్వానికి తుప్పు పట్టింది. హృదిలో స్వార్థం పురుడు పోసుకొని ఉన్మాద లక్ష ణాలు ప్రస్ఫుటమయ్యాయి. తత్ఫలి తంగా మానవ సమాజంలో అనేక అవ లక్షణాలు చోటుచేసుకున్నాయి. శాంతి భద్రతలు కరువై పొయ్యాయి. న్యాయం ప్రియమైపోయింది. కులతత్వం పెచ్చ రిల్లింది. మతోన్మాదం పడగవిప్పింది. తీవ్రవాదం, ఉగ్ర వాదం జూలువిదిల్చాయి. మతం, మానవతావాదం మంటగలిశాయి. శాంతి, సామరస్యం, సదాచారం, సహజీవనం, సద్భావన, ప్రేమ, మానవీయతలకు విఘాతం కలిగింది. నిజా నికి మత విశ్వాసం మానవులు శాంతియుతంగా, సామ రస్యంతో, సోదరభావంతో, సద్భావనతో సహజీవనం చేయడానికి దోహదపడాలి. మనుషుల మధ్య విద్వేషాలు సృష్టించడానికి అది సాధనం కాకూడదు. భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో సర్వమానవ సహిష్ణుతా భావం, పరస్పర సదవగాహన, సద్భావన జన సామాన్యంలో అంతర్వాహినిలా ప్రవహించాలి. శాంతి, ప్రేమ, సహనం, సంయమనం, సహజీవనం లాంటి సుగుణాలు జనించాలి. కులమతాలు వేరైనా మానవత రిత్యా మనదంతా పరస్పరం రక్త సంబంధమన్న పచ్చి నిజాన్ని గుర్తించాలి. ఒకరినొకరు, ఒకరి మతాన్నొకరు గౌరవించుకుంటే మనుషుల మధ్య, మనసుల మధ్య దూరాలు, వైరాలు తగ్గి మతసామరస్యం వెల్లి విరుస్తుంది. శాంతి, ప్రేమ, సామరస్యం, సద్భావన, మానవీయత పరిఢవిల్లుతాయి. విశ్వమానవ సౌభ్రాతృత్వం ఆవిష్కృత మవుతుంది. సంఘ శ్రేయోభిలాషులు, ఆధ్యాత్మిక పెద్దలు, సామాజిక కార్యకర్తలు, మంచిని, శాంతిని, మానవతను కాంక్షించే ప్రతి ఒక్కరూ ఏకతాటిపై నిలిచి, కలిసి కృషి చేస్తే, సమాజంలో శాంతీ సామరస్యాలను, సోదరభావాన్ని, సద్భావ నను పెంపొందించుకోవడం, మానవతను కాపాడుకోవడం, అసంభవం ఏమీకాదు. ఇది ఈనాటి అవసరం. ❑


సహజీవన భావనల సావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థా లను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




# నోరూరించే ద్రాక్ష... ఆరోగ్యానికి రక్ష

**ప్రకృతి..** ప్రాణికోటి అంతా ఆ దైవ సృష్టే అని ఖుర్ఆన్ చెబుతోంది. స్వర్గలోకాలలో ఉన్న ఆది మానవుడు ఈ ప్రపంచంలోని ధరిత్రిపై అడుగుపెట్టగానే అల్లాహ్ స్వర్గ లోకాలలో ఉన్న ద్రాక్ష తోటల నుంచి ద్రాక్ష పండ్లను పంపాడని ధార్మిక వేత్తలు చెబుతుంటారు. ఆది మానవుడైన ప్రవక్త ఆదమ్ (అలై) ఈ ప్రపంచంలోకి వచ్చినప్పుడు భయాందోళనలతో దుఃఖించేవారు. అల్లాహ్ తన దైవదూత ద్వారా స్వర్గ వనాలలో ఉన్న ద్రాక్ష తోటల నుంచి ద్రాక్ష గుత్తులను పంపాడు. ఆ ద్రాక్ష పండ్లను తిని ఆదమ్ (అ) తన కడుపు నింపుకునేవారు. అలా ఈ స్వర్గఫలం భూలోక వాసులకు పరిచయమయ్యింది. ఆ తరువాత వచ్చిన దైవ ప్రవక్తలంతా ద్రాక్షపండ్లను తిన్నవారే. అల్లాహ్ ద్రాక్షలో మానసిక ప్రశాంతతతోపాటు శారీరక ఆరోగ్య ప్రయోజనాలను ఉంచాడు. ఎవరికైతే నైరాశ్యం, నిస్పృహ, అనారోగ్యం ఆవరిస్తాయో అలాంటి వారు ద్రాక్ష పండ్లను తినాలంటారు పెద్దలు. ఈ భూమిపై అత్యంత ప్రాచీన పండ్లలో ద్రాక్ష ఒకటన్న విషయం బోధపడుతుంది. ఖుర్ఆన్‌లో ఆరు రకాల పండ్ల ప్రస్తావన ఉంది. వాటిలో ద్రాక్ష పండు ఒకటి. ఎన్నో ఔషధ గుణాలూ, పోషక విలువలూ కలిగి ఆరోగ్యానికి రక్షణనిచ్చే ద్రాక్ష గుత్తుల గురించి తెలుసుకుందాం..

వసంత రుతువు వచ్చిందంటే చాలు మార్కెట్లన్నీ ద్రాక్ష గుత్తులతో వేలాడుతుంటాయి. మిగతా పండ్లన్నీ చిన్నబోయాయా అనిపిస్తుంటుంది. పండ్ల మార్కెట్లు, తోపుడు బండ్లు ఇలా ఎక్కడ చూసినా పచ్చపచ్చని ద్రాక్ష గుత్తులతో కనువిందు చేస్తుంటాయి. ద్రాక్ష పండ్లను చూసిన వారెవ్వరైనా ఆగి కిలోనో, అరకిలోనో కొనాల్సిందే. కొనేటప్పుడూ నాలుగు ద్రాక్ష పండ్లను నోట్లో వేసుకోకపోతే నోట్లో నీళ్లు ఊరాల్సిందే. పుల్లపుల్లగా, తియ్యతియ్యగా ఉండే ద్రాక్ష పండ్ల సీజన్ ఉన్నంతకాలం ఫ్రిజ్జులో స్టాక్ ఉండాల్సిందే. చిన్నా, పెద్దా, ముసలి, ముతకా ఇలా అంతా ద్రాక్ష పండ్లను ఇష్టంగా తింటారు. అన్నిరకాల పోషకాలు మెండుగా ఉంటాయి. ద్రాక్షలో నీరు, సోడియం, పొటాషియం, సిట్రిక్ యాసిడ్, మెగ్నీషియం, ఐరన్ మెండుగా ఉంటాయి. ఎన్నో ప్రాణాంతక వ్యాధులకు ద్రాక్ష రసం ఔషధంగా పనిచేస్తుంది. ఉదయాన్నే పరగడుపున గుప్పెడు ద్రాక్ష పండ్లను నోట్లో వేసుకుంటే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు మీ సొంతమవుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

శరీరంలో రక్తహీనత వల్ల ఎనిమియా వ్యాధి దాడి చేస్తుంది. ఎనిమియా వ్యాధినుంచి ఉపశమనం కోరుకునేవారికి ద్రాక్ష ఎంతో మేలైనది. రోజూ ఉదయాన్నే పరగడుపున వంద గ్రాముల ద్రాక్ష పండ్లను కానీ గ్లాసెడు ద్రాక్ష రసం కానీ త్రాగితే ఎనిమియా వ్యాధి పూర్తిగా నయమవుతుంది. మైగ్రేన్ తలనొప్పి బాధితులకూ ద్రాక్ష రసం మేలుచేస్తుంది. గుండెజబ్బు బాధితులకు ద్రాక్ష రసం ఆస్పిరిన్ టాబ్లెట్లా పనిచేస్తుంది. ఈ టాబ్లెట్ రక్తం చిక్కబడకుండా చేస్తుంది. అదేవిధంగా ద్రాక్ష కూడా రక్తం చిక్కబడకుండా కాపాడుతుంది. గుండెజబ్బులు, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులను నివారిస్తుంది. హార్ట్ పేషెంట్లు నల్లద్రాక్ష రసాన్ని రోజూ తీసుకుంటే చక్కని ఫలితముంటుంది. చర్మం కాంతివంతంగా ఉంటుంది. ముఖంపై ఉన్న మచ్చల్ని తొలగిస్తుంది. ముఖంపై ఉన్న పొక్కులు, మొటిమలను నివారిస్తుంది.

అన్ని రకాల రుగ్మతల నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి ద్రాక్షరసానికి మించింది లేదంటున్నారు వైద్య నిపుణులు.

గ్లూకోజ్, చక్కెర, ఐరన్, విటమిన్-ఎ,డిలు పుష్కలంగా ఉంటాయి. అనేక రుగ్మత లకు ఔషధంగా పనిచేస్తుంది. ద్రాక్ష పండ్లు తినడం, ద్రాక్ష రసాన్ని తీసుకోవడం వల్ల మూత్రపిండాలు చురుగ్గా పనిచేస్తాయి. కిడ్నీలో రాళ్లు, మూత్ర సమస్యలు ఉన్న వాళ్లు రోజూ ఒక కప్పు ద్రాక్ష రసాన్ని తీసుకుంటే ఎంతో ఫలితముం టుంది. అజీర్తి సమస్యను అధిగమించవచ్చు. జీర్ణశక్తి పెరుగు తుంది. గ్యాస్ట్రిక్, అసిడిటీ సమస్యను అధిగమించవచ్చు. విష పదార్థాలను బయటకు నెడుతుంది. ద్రాక్షలో ఉండే ఐరన్ వల్ల రక్తహీనత వ్యాధిని నిర్మూలించుకోవచ్చు. రోజూ 50 గ్రాముల ద్రాక్ష పండ్లను తినడం వల్ల కఫము, దగ్గు, జలుబును నివారించు కోవచ్చు. అస్తమా రోగులకు ఎంతోమేలు. ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని నిర్మూలిస్తుంది. ద్రాక్షలో ఫైబర్, నీటి శాతం అధికంగా ఉండి కేలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి బరువు తగ్గాలనుకున్న వాళ్లు ద్రాక్షపండ్లు తీసుకోవడం ఉత్తమం.

పాలిచ్చే తల్లులు ద్రాక్ష పండ్లను తప్పకుండా తినాలంటారు వైద్యులు. చనుబాలు పెరుగుతాయి. మేధోశక్తి పెరుగుతుంది. ఒత్తిళ్లను అధిగమించవచ్చు. హార్మోన్లను బాలెన్స్ చేస్తుంది. రుతుక్రమం సక్రమంగా అవుతుంది. పీరియడ్లలో వచ్చే సమస్యలను అధిగమించవచ్చు. అర్థరైటిస్, జాయింట్ పెయిన్స్‌ను తగ్గించుకోవచ్చు. రక్తాన్ని పల్చగా చేయడంలో ద్రాక్షకు మించిన పండు లేదు. రక్త పోటును నియంత్రిస్తుంది. కళ్లకాంతి మెరుగవుతుంది. జ్వరాన్ని అదుపు చేసుకోవచ్చు. నోటి దుర్వాసన, చిగుళ్ల నొప్పిని నివారించుకోవచ్చు. గొంతు నొప్పి, వాపు నుంచి ఉపశమనం పొందవచ్చు. మన చర్మ సౌందర్యానికి కూడా ద్రాక్ష ఎంతో మేలైనది. చుండ్రు, జుట్టు రాలే సమస్య ఉన్నవారు ద్రాక్ష రసాన్ని తలకు పట్టిస్తే చక్కని ఫలిత ముంటుంది. ఆకలి మందగించే వారు ద్రాక్ష రసం సేవిస్తే జీర్ణశక్తి మెరుగవుతుంది. నోటి పుండ్లతో బాధపడేవారు ద్రాక్ష రసాన్ని నోట్లో పట్టించి పుక్కిలిస్తే ఉపశమనం లభిస్తుంది. బ్రెస్ట్ క్యాన్సర్ లాంటి ప్రాణాం తక వ్యాధి కూడా ద్రాక్ష రసం సేవనం వల్ల నివారించుకోవచ్చని వైద్య పరిశోధనల్లో తేలింది. గర్భిణులు ద్రాక్ష పండ్లను తినడం వల్ల కడుపులో వికారం, తలతిరడం వంటి వాటినుంచి రక్షణ పొందవచ్చు. ముఖ చర్మం పొడిబారిన వారు ద్రాక్షరసంలో తేనెను కలుపుకుని ముఖానికి పట్టించి తేలికైన మర్ధన చేయాలి. 20 నిమిషాల తరువాత నీళ్లతో ముఖం కడుక్కుంటే ముఖం ఆకర్షణీయంగా, అందంగా కనిపించవచ్చు.

## ఖుర్ఆన్‌లో ద్రాక్ష తోటల ప్రస్తావన..

ద్రాక్ష, జైతూను, దానిమ్మ తోటలను సృష్టించాడు. వాటి పండ్లు ఒకదానినొకటి పోలి వుండినప్పటికీ ప్రతిదాని ప్రత్యే కతలు వేర్వేరుగా కూడా ఉంటాయి. (దివ్య ఖుర్ఆన్ 6:99)

చూడండి! భూమిలో వేర్వేరు ప్రదేశాలు ఉన్నాయి. అవి ఒకదాని కొకటి ప్రక్క ప్రక్కన ఉన్నాయి. ద్రాక్ష తోటలూ ఉన్నాయి. (13:4)

ప్రవక్తా! వారి ముందు ఒక ఉపమానం పేర్కొను: ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకనికి మేము రెండు ద్రాక్ష తోటలు ఇచ్చాము. (18:32)

తరువాత ఆ నీటి ద్వారా మేము మీ కొరకు ఖర్జూరపు తోటలనూ, ద్రాక్ష తోటలనూ సృష్టించాము. ఈ తోటలలో మీ కొరకు అత్యంత రుచికరమైన పండ్లు ఉన్నాయి. (23:19)

నిశ్చయంగా భయభక్తులు కలవారి కొరకు ఒక సాఫల్య స్థానం ఉంది ఉద్యాన వనాలూ, ద్రాక్షతోటలూ, సమ వయస్సు గల సుకన్యలూ, మద్యంతో నిండిన మధుపాత్రలూ ఉన్నాయి. (78:32)

### కిష్మిష్... ఎండు ద్రాక్ష

ద్రాక్షను ఎండబెట్టి తిని చూడండి ఎలాంటి అద్భుతాలు జరుగు తాయో అని వైద్యులు చెబుతున్నారు. ద్రాక్ష పండ్లను ఎండబెట్టి అమ్ముతుంటారు. వాటినే కిష్మిష్ అంటారు. పచ్చగా ఉండే ద్రాక్ష ఎండాక బంగారం రంగులో మారుతుంది. రక్త ప్రసరణకు కిష్మిష్ ఎంతో ఉపయుక్తమవుతుంది. చర్మ సంబంధిత రోగాలను దరి చేరనివ్వదు. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణశక్తికి ఎంతో మేలు చేస్తుంది. పొటాషియం, ఐరన్ మెండుగా ఉంటుంది. రోజూ ఐదు కిష్మిష్లు తింటే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ప్రాణాంతక క్యాన్సర్‌ను నివారిస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ దగ్గు, జలుబును త్వరగా నయం చేస్తుంది. ఇందులో యాసిడ్ దంతాల పటిష్టతకు ఉపయో గకరం. జాయింట్ పెయిన్‌తో బాధ పడే వారు కిష్మిష్లు ఔషధంగా తీసుకోవాలి. ఇందులో ఉండే కాల్షియం అన్నిరకాల నొప్పులను నయం చేస్తుంది. వేసవి కాలంలో తినాలనుకునేవారు రాత్రి పూట కిష్మిష్‌ను నీళ్లల్లో నానబెట్టుకుని పరగడుపున తినాలని వైద్యులు సూచిస్తున్నారు. దీనివల్ల వేడిచేయదు. ఇలా తినడం వల్ల లైంగిక పటుత్వం పెరుగుతుంది. ఇన్నిన్ని ఔషధ ప్రయోజనాలున్న ద్రాక్ష పండ్ల సీజన్ వచ్చేసింది మీ ఇంటిల్లిపాదీ తిని ఆరోగ్య రక్షణ పొందండి.



# జాతిని కదిలించిన ఉద్యమ నినాదాలు

**- యండి. ఉస్మాన్ ఖాన్**

**భారతదేశ** స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో మంది త్యాగ ధనులు తమ రక్తాన్ని, ప్రాణాన్ని ధారపోసి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలు కూడా జరుపుకొన్నాం. ఈ సందర్భంగా ఉద్యమానికి స్ఫూర్తిని, ప్రేరణను అందించిన, శక్తివంతమైన కొన్ని నినాదాలను మననం చేసుకోవడం మన నైతిక కర్తవ్యం. సాధారణంగా రాజులు యుద్ధాలకు వెళ్ళేటప్పుడు శత్రు సైన్యాన్ని భయపెట్టే ఉద్దేశంతో రకరకాల ధ్వనులు, భీకరమైన శబ్దాలు, రణన్నినాదాలు చేస్తారు. అరుపులు, కేకలు, నినాదాలతో యుద్ధ మైదానం మార్మోగిపోతుంది. ఢమరుక నాదం, శంఖానాదాలతో తమ సైనికుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, శత్రు సైన్యంలో భయోత్పాతాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తారు. అటువంటి సాధనాలలో నినాదం ఓ ప్రముఖ ఆయుధం. 'క్విట్ ఇండియా' (1942) నినాదం మనందరికీ సుపరిచితం. ఇది భారతీయుల హదయాల్లో ఎంతగా నాటుకుపోయిందో బ్రిటిష్ పాలకుల గుండెల్లో కూడా అంతగా గుచ్చుకుపోయి వారిని భయకంపితుల్ని చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ స్వాతంత్ర్యోద్యమాన్నే ఈ నినాదం ఓ మలుపు తిప్పింది. 'క్విట్ ఇండియా' ఇంతటి శక్తివంతమైన నినాద రూపకర్త యూసుఫ్ మెహర్ అలీ. ఉద్యమ సమయంలో ఆయన ముంబై మేయర్‌గా ఉన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన ఎనిమిది సార్లు జైలుకెళ్లారు. స్వాతంత్ర్యోద్యమానికి ఊపునిచ్చిన 'క్విట్ ఇండియా' అనే పదం నేపథ్యాన్ని చూసినట్లయితే, దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వ్యూహ రచన చేస్తున్న మహాత్మాగాంధీ తన సహచరులతో ముంబైలో సమావేశమైనప్పుడు స్వాతంత్ర్య పోరాటానికి పనికొచ్చే మంచి నినాదాలను సూచించాలని కోరారు. అప్పుడు ఒకరు 'గెటవుట్' అని అన్నారు. అది బాగా లేదని గాంధీజీ తిరస్కరించారు. 'రిట్రీట్ ఆర్ విత్‌డ్రా' అన్న పదాన్ని రాజగోపాలచారి సూచించగా, అక్కడే ఉన్న యూసుఫ్ మెహర్ అలీ 'క్విట్ ఇండియా' అనే పదాన్ని ప్రతిపాదించారు. గాంధీజీకి ఈ నినాదం అమితంగా నచ్చి, వెంటనే ఆ పదాన్ని ఆమోదించారు. అలాగే 'సైమన్ గోబ్యాక్' అనే విప్లవాత్మక నినాదం కూడా యూసుఫ్ మెహర్ అలీదే. ఈ నినాదం కూడా విపరీతంగా ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. 1928లో నాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వ పాలన మెరుగుపర్చేందుకు సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం బ్రిటిష్ పాలకులు సైమన్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అందులో ఒక్క భారతీయుడికీ స్థానం కల్పించలేదు. అందరూ బ్రిటిష్ అధికారులే ఉన్నారు. దీనికి నిరసనగా, 1928లో సైమన్ కమిషన్ ముంబై రేవులో దిగినప్పుడు యూసుఫ్ మెహర్

అలీ కొంత మందితో కలిసి కూలీల వేషంలో రేవుకు వెళ్ళి 'సైమన్ గోబ్యాక్' అని గర్జిస్తూ నిరసన ప్రదర్శన చేశారు.

మరో స్ఫూర్తిదాయకమైన, చైతన్యశీల నినాదం 'ఇంక్విలాబ్ జిందాబాద్'. ఈ నినాదాన్ని ప్రముఖ ఉర్దూకవి, ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా హస్రత్ మోహానీ రూపొందించారు. ఈ నినాదం భగత్ సింగ్‌కు అమితంగా నచ్చింది. అత్యంత ప్రభావవంతమైన ఇంక్విలాబ్ జిందాబాద్ అనే ఈ నినాదాన్ని షహీద్ భగత్ సింగ్ విపరీతంగా ప్రాచుర్యం లోకి తెచ్చారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటే.. విప్లవం వర్ధిల్లాలి. అని అర్థం. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాట రణ నినాదాలలో ఒకటిగా మారిపోయింది. భారతీయ యువతను స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేవిధంగా ప్రేరేపించింది. ఇది వారిలో దేశభక్తి భావనను, స్వాతంత్రేచ్ఛను జాగృతం చేసింది. సత్యమేవ జయతే- ఈ నినాదాన్ని పండిట్ మదన్ మోహన్ మాలవీయ రూపొందిం చారు. ఎప్పటికైనా సత్యమే జయిస్తుంది అనేది దీని అర్థం. దీన్ని మనం జాతీయ నినాదంగా స్వీకరించడమే కాకుండా మన జాతీయ చిహ్నం మీద కూడా ఇది రాయబడి ఉంటుంది. 1918లో భారత జాతీయ కాంగ్రెస్ సదస్సుకు అధ్యక్షత వహిస్తూ పండిట్ మదన్ మోహన్ మాలవీయ ఈ నినాదాన్ని ఉద్ఘోషించారు. అలాగే, ఆసేతు హిమాచలం ఆబాల గోపాలాన్ని ఉర్రూతలూ గించిన నినాదం 'జైహింద్'. దీన్ని హైదరాబాదుకు చెందిన ఆబిద్ హసన్ సఫ్రానీ రూపొందించారు. అతి కొద్దికాలంలోనే నేతాజీ ద్వారా ఈ నినాదం స్వాతంత్ర్య సమరయోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశభక్తులు తరచూ ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమానమైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకు పోయింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సుభాష్ చంద్ర బోస్ స్వాతంత్ర్య సమరానికి మద్దతు కూడగట్టేందుకు జర్మనీ వెళ్లారు. ఆ సమయంలో జర్మనీ బ్రిటన్‌తో యుద్ధం చేస్తోంది. అదే సమయంలో అబిద్ కూడా తన ఇంజనీరింగ్ చదువు నిమిత్తం జర్మనీ వెళ్ళారు.

బోస్ ప్రసంగాలకు ప్రభావితమైన అబిద్ హసన్ తన ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరిపొయ్యారు.

బోస్ పునర్వ్యవస్థీకరించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో అబిద్ మేజర్‌గా కూడా పని చేశారు.

ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారు. అందులో కొంత మంది 'నమస్కార్' అని సంబోధిస్తే, మరికొంత మంది 'రామ్ రామ్' అంటూ పలకరించుకునేవారు. 'సత్ శ్రీ అకాల్', 'అస్సలామలైకుం' అంటూ అభివాదం చేసుకునే వారు కూడా ఉండేవారు.

సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోద యోగ్యమైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని బోస్ తన సన్నిహితులకు చెప్పారు. అబిద్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు కాని బోస్‌కు అదినచ్చలేదు. తర్వాత 'జై హిందుస్తాన్' 'జై హింద్' అనే నినాదాలను సూచించారు. జై హిందుస్తాన్ కాస్త పెద్దగా ఉండడంతో బోస్ 'జై హింద్' కే జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, విశేషంగా ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చారు. అప్పటి నుంచి 'జై హింద్' అనే పదం దేశ భక్తిని చాటుకునే ఒక నినాదంగా మారిపోయింది. అదేవిధంగా.. మీరు నాకు రక్తాన్నివ్వండి నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను అని నినదించారు నేతాజీ. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతీయ సైన్యంలో చేరాలని భారత యువతను కోరుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ నినాదాన్ని ప్రయోగించారు. మాతృభూమి కోసం తమ జీవితాలను త్యాగం చేయడానికి వేలాది యువ హృదయాలను ఈ నినాదం ప్రేరేపించింది. వేలాదిమంది యువతీ యువకులకు ఈ నినాదం ఒక రణ నినాదమై అయస్కాంతంలా యువతను ఆకర్షించి స్వాతంత్రోద్యమం వైపు పరుగులు తీయించింది

అలాగే.. స్వరాజ్యం నా జన్మహక్కు అనే నినాదం. కాకా బాప్టిస్టా పలికిన ఈ నినాదాన్ని బాల గంగాధర్ తిలక్ స్వీకరించారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశప్రేమికుల గుండెల్లో స్వతంత్ర జ్వాలలు రేకెత్తించారు. ఈ నినాదం దేశ ప్రజలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ప్రేరేపించడమే కాక, వేలాది మంది ప్రజల హృదయాల్లో దేశంపై ప్రేమను ఉరకలెత్తించింది. ముందే చెప్పుకున్నట్లు, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఆంగ్లేయు లకు అంతిమంగా ఇచ్చిన ఒక వార్నింగ్ 'క్విట్ ఇండియా'. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ చేసిన బలమైన, అత్యంత గంభీర మైన ఒక విజ్ఞప్తి. బ్రిటిష్ వారిని ఒక్కసారిగా, స్పష్టంగా భారత దేశాన్ని విడిచిపెట్టమని చేసిన హెచ్చరిక. ఈ క్విట్ ఇండియా ఉద్యమం నుండి వచ్చిందే 'డూ ఆర్ డై' నినాదం. జాతీయ సమైక్యత, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాతంత్ర్య పోరాటం సాగుతుండగా గాంధీజీ ఇచ్చిన పిలుపు డూ ఆర్ డై ఉద్యమ కారుల్లో స్ఫూర్తిని నింపింది.

ఇవేకాకుండా ఇంకా ఇలాంటి అనేక నినాదాలు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాయి. మన స్వాతంత్ర్యసమర యోధులు చేసిన నినాదాలు శతృహృదయాల్లో భీతిని కలిగించి మాతృభూమిని పరాయి బానిసత్వం నుండి విముక్తి చేశాయి.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

4 వాస్తవానికి ఇది గ్రంథమాతృకలో పొందుపరచబడి ఉంది మా వద్ద ఎంతో ఉన్నత స్థానం, విజ్ఞత నిండిన గ్రంథం.[3]

5 – 8 అయితే మేము ఇప్పుడు మీ పట్ల విసుగెత్తి ఈ హితబోధనను మీ వద్దకు పంపడం మానుకోవాలా, అదీ కేవలం మీరు హద్దుమీరి ప్రవర్తిస్తున్న జనం కావడం చేతనేనా?[4] పూర్వం గతించిన జాతుల లోనూ అనేక పర్యాయాలు మేము ప్రవక్తల్ని పంపాము. ఎవరయినా ప్రవక్త వారి వద్దకు రావడం అన్నది వారు అతన్ని పరిహాసానికి గురిచెయ్యకపోవడమన్నది ఎన్నడూ జరగలేదు.[5] మరి మేమేమో వీరికన్నా ఎన్నోరెట్లు బలశాలు రయిన జనుల్ని సంహరించాము. వెనుకటి జాతుల ఉదాహరణలు గతించాయి.

3. ఈ వాక్యం సంబంధం అటు “ప్రస్ఫుటమయిన గ్రంథం”తోనూ ఉంది, ఇటు “గ్రంథమాతృక”తోనూ ఉంది. అంటే, ఈ నిర్వచనం ఖుర్ఆన్‌కూ వర్తిస్తుంది, ఖుర్ఆన్ దేని ఆధారంగా ఉటంకించ బడిందో లేదా గ్రహించబడిందో ఆ మూల గ్రంథానికీ వర్తిస్తుం దన్నమాట. ఈ నిర్వచనం ద్వారా మనోగతం చేయ ఉద్దేశించిన విషయం, ఒక వ్యక్తి తన అవివేకం వల్ల ఈ గ్రంథం విలువను, స్థానాన్నీ గ్రహించకపోతే, దీని విజ్ఞత నిండిన బోధనల ద్వారా ప్రయోజనం పొందకపోతే అది అతని దౌర్భాగ్యం. ఎవరయినా దీని స్థానాన్ని హీనపరచడానికి ప్రయత్నిస్తే, దీని బోధనల్లో వంకలు వెదకసాగితే అది అతని నైచ్యమే తప్ప మరేమీ కాదు. ఒకరి నిరాదరణ వల్ల ఇది విలువలేనిదిగా కాజాలదు. మరొకరు దుమ్మెత్తి పోయడం వల్ల దీని విజ్ఞత దాగజాలదు. ఇది దీని స్థానే ఒక ఉన్నతస్థాయి గ్రంథం. దీని అనుపమ బోధనలు, దీని అద్భుతమయిన భావగర్భిత, దీని మచ్చలేని విజ్ఞతా వివేచనలు, మహా మహిమాన్వి తుడయిన రచయిత వల్ల దీని స్థాయి ఉన్నతపరచబడింది. ఇది ఒకరు దిగజార్చడం వల్ల ఎలా పడిపోతుంది. ముమ్ముందు 44వ ఆయత్‌లో ఖురైష్‌ని ప్రత్యేకంగానూ, అరబ్బులను సాధారణంగాను సంబోధించి, మీరు ఇలా నిరాదరణ చూపుతున్న ఈ గ్రంథం అవతరణ మీకు ఒక శ్రేష్ఠత పొందే అవకాశాన్ని కల్పించింది. దీన్ని మీరు కోల్పోయినట్లయితే దైవం సమక్షంలో మీరు అతి కఠినమయిన పరీక్షకు, జవాబుదారీ తనానికి లోనవవలసి ఉంటుంది. (చూడండి పాద సూచి నెం. 39).

4. ఈ ఒక్క వాక్యంలో పూర్తి గాథను ఏకత్రం చేయడం జరిగింది. ఆ గాథ మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) దైవదౌత్య ప్రకటన మొదలుకుని ఈ ఆయత్‌లు అవతరించేవరకు, గత కొన్ని సంవత్సరాలలో సంభవించినది. ఈ వాక్యం మన ముందుంచే చిత్రం ఇది: ఒకజాతి శతాబ్దుల తరబడి తీవ్ర అజ్ఞానం, పతనం, వెనుకబాటుతనానికి గురయి ఉంటుంది. అకస్మాత్తుగా పరమ ప్రభువు అల్లాహ్ కటాక్షవీక్షణం దానిపైన పడుతుంది. ఆయన అందులో ఒక ఉత్తమ మార్గదర్శకుణ్ణి ఆవిర్భ వింపజేస్తాడు. ఆ జాతిని అజ్ఞానపు చీకట్ల నుండి వెలికిదీయడానికి ఆయన స్వయంగా తన వచనాన్ని అవతరింపజేస్తాడు – ఆ జాతి ఏమరుపాటు నుండి మేల్కొనాలని, అజ్ఞానపు విశ్వాసాల ఊబి నుండి బయటపడాలని, వాస్తవికతను తెలుసుకుని, జీవితపు సరయిన బాటను అవలంబించాలని. కాని ఆ జాతిలోని అవివేకు లయిన జనులు, దాని స్వార్థపరులయిన తెగల నాయకులు ఆ మార్గదర్శకుని వెంటపడతారు. అతన్ని నిష్ఫలం చేయడానికి శాయశక్తులా శ్రమిస్తారు. సంవత్సరాలు గడచిన కొద్దీ వారి వైషమ్యం, దౌష్ట్యం పెరుగుతూ పోతాయి. కడకు వారు అతన్ని హతమార్చడానికి సమాయత్తమవుతారు. ఇటువంటి పరిస్థితిలో ఇలా ఉపదేశించడం జరుగుతోంది, మీ అవివేకం వల్ల మేము మీ సంస్కరణాయత్నాలను మానుకోవాలా? ఈ ఉపదేశ క్రమాన్ని ఆపివేయాలా? మీరు శతాబ్దుల తరబడి పడి ఉన్న పతనంలోనే పడి ఉండేలా మిమ్మల్ని వదలిపెట్టాలా? మీ దృష్టిలో మా కారుణ్యానికి పరమావశ్యకత ఇదేనా? మీరేమయినా ఆలోచించారా, దైవానుగ్రహాన్ని తిరస్కరించడం, సత్యం ముందుకు వచ్చిన తరువాత మిథ్య కొరకే పట్టుపట్టడం మిమ్మల్ని ఎటువంటి అంతిమ పరిణామానికి గురిచేస్తుందో యోచించారా?

5. అంటే, ఇటువంటి వెకిలిచేష్టలు, పోకిరి చేష్టలు ప్రవక్తను, దైవగ్రంథాన్నీ పంపడంలో అవరోధాలయినట్లయితే ఏ జాతిలోనూ ఏ ప్రవక్తా వచ్చేవాడు కాదు, ఏ గ్రంథమూ అవతరించి ఉండేది కాదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

## అధ్యాయం : 44
## మహనీయ సాద్ బిన్ ముఆజ్ (రజి) విశిష్టత[1]

**439)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా నేను విన్నానని హజ్రత్ జాబిర్(రజి) తెలిపారు : ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "సాద్ బిన్ ముఆజ్(రజి) మరణంపై సింహాసనం (అర్ష్) కదిలింది"... వేరొక ఉల్లేఖనం ప్రకారం కూడా దైవప్రవక్త(స) ఇలాగే వక్కాణించారు. ఒక వ్యక్తి జాబిర్(రజి)తో, 'ముఆజ్(రజి) భౌతిక కాయం ఉంచబడిన మంచం కదిలింది' అని బరా బిన్ ఆజిబ్(రజి) వివరించారు కదా!' అని అడగ్గా, హజ్రత్ జాబిర్(రజి) ఇలా అన్నారు: ఆ రెండు తెగల (ఔస్- ఖజ్రజ్) మధ్య అజ్ఞాన కాలంలో శత్రుత్వం ఉండేది. "సాద్ బిన్ ముఆజ్ (రజి) మరణంపై కరుణామయుని సింహాసనం కదిలిపోయింది"[1] అని స్వయంగా దైవప్రవక్త(స) చెప్పగా నేను విన్నాను.

## అధ్యాయం : 45
## ఉసైద్ బిన్ హుజైర్ (రజి), అబ్బాద్ బిన్ బిష్ర్ (రజి)ల విశిష్టత[1]

**441)** హజ్రత్ అనస్(రజి) కథనం : ఒకసారి రాత్రి చీకటిలో ఇద్దరు పురుషులు (ఉసైద్ బిన్ హుజైర్, అబ్బాద్ బిన్ బిష్ర్) దైవప్రవక్త(సఅసమ్) సమావేశం నుండి లేచి తమ ఇండ్లకు బయలుదేరారు. వారిద్దరి ముందు ఒక కాంతి ప్రసరించసాగింది. కొంతదూరం వెళ్ళి వారిద్దరూ ఒండొకరి నుండి వేరైనప్పుడు ఆ కాంతి కూడా రెండు భాగాలుగా విడిపోయింది.

## అధ్యాయం : 48
## ఉబై బిన్ కాబ్ (రజి) గురించి[1]

**444)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి) గారి సమావేశంలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన ఇలా అన్నారు : దైవప్రవక్త(స) చెప్పిన నాటినుంచే నా హృదయంలో ఆయన గారి పట్ల ప్రేమాదరణలు చోటు చేసుకున్నాయి. దైవప్రవక్త(స) ఇలా చెప్పారు: నలుగురు వ్యక్తుల నుండి ఖుర్ఆన్ నేర్చుకోండి- 1) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) నుండి - దైవప్రవక్త ఈయన పేరుతోనే మొదలెట్టారు- 2) అబూ హుజైఫా బానిస సాలిమ్(రజి) నుండి 3) ముఆజ్ బిన్ జబల్(రజి) నుండి 4) ఉబై బిన్ కాబ్(రజి) నుండి."

44-1. హజ్రత్ సాద్ బిన్ ఉబాదా ఖజ్రజ్ తెగకు సర్దారు అయినట్లే ఈయన ఔస్ తెగకు సర్దారు.

439-1. ఈ హదీసుపై వ్యాఖ్యాతల మధ్య ద్వంద్వాభిప్రాయం ఉంది. ఇస్లామ్‌కు పూర్వం మదీనాలో ఔస్- ఖజ్రజ్ తెగల మధ్య శత్రుత్వం ఉండేది. కాని ఇస్లామ్ తర్వాత ఈ శత్రుత్వం సమసిపోయింది. హజ్రత్ సాద్ (రజి) ఔస్ తెగకు నాయకులు. మొత్తానికి సాద్ బిన్ ముఆజ్(రజి) మరణం ముస్లిం సమాజానికి తీరని లోటు అన్న విషయంలో హదీసువేత్తల మధ్య ఏకాభిప్రాయం ఉంది.

45-1. వీరిద్దరూ అన్సార్ సహాబీలే. ఉసైద్ ఔస్ తెగకు చెందినవారు. అబ్బాద్ బిన్ బిష్ర్ ఖజ్రజ్ తెగవారు.

48-1. ఈయన ఖజ్రజ్ తెగకు చెందిన అన్సార్ సహాబి. బైఅతె అఖబాలో పాల్గొన్నారు. బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. విద్వాంసులు. హిజ్రీ 30వ సంవత్సరంలో మరణించారు. హజ్రత్ ఉమర్(రజి) ఈయన్ని 'సయ్యిదుల్ ముస్లిమీన్' అని అనేవారు.




మూలం: మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)          అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## 5) విశ్వంలోని వస్తువులపై నియంత్రణ

దేవుని ఏకత్వానికి మరో మచ్చుతునక ఏమిటంటే, ఈ జగతిలో మనకు కనిపించే బ్రహ్మాండమైన వస్తువులు సయితం దైవాజ్ఞల పాలనలో, ఆయనకు విధేయత చూపటంలో నిమగ్నమై ఉన్నాయి. వాటిలో ఏ ఒక్క దానిలో కూడా దైవత్వపు గుణం ఉందని చెప్పడానికి ఎంతమాత్రం వీల్లేదు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు తమ అందాలతో, వైభవంతో వెలుగొందుతూ ఉన్నప్పటికీ, భూమి, సముద్రం, కొండలు, నదులు, గాలులు, మేఘాలు, ఉరుములు, మెరుపులు- ఇవన్నీ ఈ జగతిలో తమ శక్తినీ, విస్తృతినీ చాటుకుంటున్నప్పటికీ- ఇవన్నీ ఒక పటిష్టమైన ప్రభు సత్తాకు, ఆయన ఆదేశాలకు కట్టుబడి ఉన్నాయి. మరైతే వీటన్నింటినీ సృష్టించిన ఆ సృష్టికర్త ఎవరో ఆలోచించండి. ఈ ప్రశ్నను ఖుర్ఆన్ పదేపదే లేవనెత్తింది. దాని సమాధానాన్ని కూడా అరబ్బు బహుదైవారాధకుల నోట చెప్పించింది. ఈ జగతికి కర్త ఒకడున్నాడనీ, ఆయన సర్వాధిక్యుడనీ, వివేచనా దురంధరుడని వారు చెప్పారు- "ఈ గగన భువనాలను సృష్టించినదెవరు?" అని మీరు వారిని అడిగితే, సర్వాధిక్యుడు, సర్వజ్ఞాని అయిన దేవుడు వీటిని సృష్టించాడని వారు సమాధానం ఇస్తారు. ఎందుకంటే ఈ విశ్వ మండలంలో కానవచ్చే బ్రహ్మాండమైన వస్తువులను ఎవరయినా చూసినప్పుడు, ఘనత కలవాడు, గౌరవనీయుడు, వివేక సంపన్నుడు, మహాజ్ఞాని అయిన వాడు మాత్రమే వీటిని సృష్టించగలడన్న నిర్ధారణకు వస్తాడు.

ఇక్కడ గమనించవలసిన ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే మనకు కానవచ్చే వస్తువులలో ఏది ఎంత పెద్దగా ఉంటే, దాని నుదుటిపైన అంతే పెద్ద విధేయతా చిహ్నం కనిపిస్తుంది. ఈ ప్రపంచం ఇతరత్రా వస్తువులన్నిటికన్నా సూర్యచంద్రులను అత్యధికంగా పూజించింది. చూడబోతే దీనావస్థ, విధేయత, ఆజ్ఞాపాలన, సాష్టాంగ ప్రణామం, చంద్ర గ్రహణం, సూర్యగ్రహణం లాంటి చిహ్నాలను వాటిలో (సూర్యుడు, చంద్రునిలో) చూసినప్పుడు, ఈ రెంటిలో ఉన్నంత దీనావస్థ మరే వస్తువులో కూడా కనిపించదు. కాని ఈ మనిషి పరిస్థితి కూడా కడు విచిత్రమైనది! వీటన్నింటినీ తన కళ్లతో చూస్తూ కూడా అతను సూర్యచంద్రులను దేవతలుగా నమ్మి వాటిని పూజిస్తాడు.

తౌహీద్ (దేవుని ఏకత్వం)కు సంబంధించిన ఈ సూచనలను, ఆధారాలను ఖుర్ఆన్ కొన్ని చోట్ల క్లుప్తంగా, మరికొన్ని చోట్ల వివరంగా విశదీకరించింది. మేమిక్కడ కేవలం మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) పరిశోధనను సమర్పిస్తున్నాము. ఆయన తన జాతి జనుల ముందు ఎంతో అపురూపంగా, తిరుగులేని విధంగా తన వాదనను సమర్పించారు:

# తౌహీద్ వాస్తవికత

**రాత్రి అతనిపై (ఇబ్రాహీముపై) ఆవరించగానే అతను ఒక నక్షత్రాన్ని చూశాడు. అన్నాడు : "ఇది నా ప్రభువు" అని. కాని అది అస్తమించగానే అతను "అస్తమించే వాటిని నేను ప్రేమించను" అని అన్నాడు. చంద్రుడు ప్రకాశిస్తూ కనిపించగానే అతను, "ఇదీ నా ప్రభువు" అని అన్నాడు. కాని అదీ అస్తమించగానే, "నా ప్రభువు గనక నాకు మార్గమే చూపి ఉండకపోతే, నేనూ మార్గభ్రష్టులలో కలిసి పోయి ఉండేవాణ్ణే" అని అన్నాడు. తరువాత అతను సూర్యుణ్ణి ప్రకాశిస్తూ ఉండగా చూసి, "అసలు ఇదీ నా ప్రభువు! ఇది అన్నిటికంటే పెద్దది" అని పలికాడు. కాని అది కూడా అస్తమించగానే ఇబ్రాహీము ఎలుగెత్తి ఇలా ప్రకటించాడు : "నా జాతి సోదరులారా! మీరు దైవానికి భాగస్వాములుగా నిలబెట్టే వాటన్నింటితోనూ నాకు ఏ విధమైన సంబంధం లేదు. నేను ఏకాగ్రతతో నా ముఖాన్ని భూమ్యాకాశాలను సృష్టించిన శక్తి వైపునకు తిప్పుకున్నాను. నేను 'షిర్క్'కు ఒడిగట్టే వారిలోని వాణ్ణి ఎంతమాత్రం కాను." *(అల్ అన్ఆమ్ : 76-79)***

## 6) విశ్వం- దాని పటిష్టమైన ఉపాయం

అలాగే దేవుని అస్తిత్వానికి, ఆయన ఏకత్వానికి సంబంధించిన అతి పెద్ద సాక్ష్యాధారం పటిష్టమైన, సర్వతోముఖమైన ఆయన ఉపాయం, పరిపాలనా వ్యవస్థ, జగతిలోని ప్రతి మూలన మనం దీనిని చూడగలము. ఈ భువనభాంతరాలలో ఒక దానితో ఒకటి పొసగని ఎన్నో చిన్నాపెద్ద సృష్టితాలు నెలకొని ఉన్నాయి. వాటిలో ప్రతిదీ తన తెలివితేటలను, శక్తి సామర్థ్యాలను బట్టి మనుగడ సాగిస్తున్నది. ఒకవైపు చూస్తే ఏమనిపిస్తుందంటే, ఈ జగతిలోని ప్రతి శక్తి ముకుతాడు లేని ఒంటె మాదిరిగా తన దిశలో సాగిపోతోంది. అది ఏ నియంత్రణా వ్యవస్థకు కట్టుబడి లేదని, ఏ అత్యున్నత సార్వభౌమాధికారి ఆజ్ఞలకూ లోబడకుండా యథేచ్ఛగా ముందుకు వెళ్ళిపోతోందని అనిపిస్తుంది. అంతలోనే అకస్మాత్తుగా ఒక గోప్య హస్తం దాని పగ్గాలను పట్టుకుని, దానిని ఒక దిశ నుండి మరో దిశ వైపునకు మరల్చటం మనం గమనిస్తాము. మనం ఎన్నోసార్లు చూస్తుంటాము- అంతరిక్షంలోని గ్రహాలు, నక్షత్రాదులు ఏదైనా ఒక ప్రత్యేక దిశలో సాగిపోతుంటాయి. అవి గనక అలాగే ముందుకుపోతే మన ఈ భూమండలం తునాతునకలైపోవటం ఖాయం. ఈ రకమయిన సంఘటనల ఆధారంగా అప్పుడప్పుడూ ఖగోళ శాస్త్రజ్ఞులు ప్రకటిస్తూ ఉంటారు- ఫలానా గడువులోగా ఈ భూమండలం ఫలానా గ్రహంతో ఢీకొంటుందని. కాని తీరా ఆ గడువు ముగుస్తున్నప్పుడు మనం చూసేదేమిటి? ఆ గ్రహం అత్యంత లాఘవంగా తన దిశ మార్చుకుని వెళ్ళిపోతుంది. అందులో ఉన్న వారెవరో దాని కళ్లెం పట్టుకుని, దాని రూటు మరల్చారనీ, తత్కారణంగా భూమిపై అప్పటి వరకు ఖడ్గంలా వ్రేలాడిన ప్రమాదం కాస్తా తప్పిపోయిందని అనిపిస్తుంది.

కాస్త ఆలోచించండి! ఇంతకీ ఆ 'రౌతు' ఎవరు? భువనభాంతరాలలోని ఈ శక్తులను, గ్రహాలను, శరీరాలను నియంత్రించే వాడెవడు? ఆయన కోరినంత మేర వాటిని వదులుతున్నాడు. ఎక్కడ ఆపాలో అక్కడ ఆపుతున్నాడు. ఆ తరువాత అవి ఒక అంగుళం కూడా ముందుకు పోయేందుకు సాహసించలేవు. ఇదంతా కాకతాళీయం అంటారా? ఏమిటీ, గుడ్డివాడు, చెవిటివాడు అయిన శక్తి దయాదాక్షిణ్యాలపై ఇదంతా నడుస్తోందా? ఏమిటి, మానవ మేధకు, మనిషిలోని మనసుకు ఈ సమాధానాల ద్వారా తృప్తి లభిస్తుందా? దీనికి ఖుర్ఆన్ ఇలా సమాధానం ఇస్తోంది :

**"అల్లాహ్ ఆకాశాలను, భూమిని నిలిపి ఉంచాడు- అవి తమ స్థానం నుండి దొర్లిపోకుండా ఉండేటందుకు. ఒకవేళ అవి గనక దొర్లిపోతే, తరువాత వాటిని పట్టి నిలిపేవాడెవడూ లేడు. నిశ్చయంగా ఆయన అత్యంత సహనశీలుడు, క్షమించేవాడూను" -ఈ సమాధానంలోని సత్యాన్ని కాదనే వాడెవడు?**

ఈ భౌతిక ప్రపంచంలో వివిధ శక్తుల మధ్యన మనం గమనించే ఉపాయం, వ్యవస్థ ఇది. ఇంతకన్నా ముందుకుపోయి

ఈ వ్యాసం **'తౌహీద్ వాస్తవికత'** పుస్తకంలోనిది. పూర్తి పుస్తకం చదవదలచిన వారు తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ వారిని సంప్రతించగలరు.

మనం గనక ఈ జగతిలోని నైతిక శక్తుల వ్యాఘాతం, మరి వాటి వల్ల సంభవించే ఫలితాలను గురించి ఆలోచిస్తే అక్కడ కూడా ఇదే శాసనం పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది.

ఒక అసత్య సిద్ధాంతం జనిస్తుంది. ఆ సిద్ధాంతం ధ్వజవాహకులు జన్మిస్తారు. దానిపై ఒక మిథ్యా నైతిక వ్యవస్థ, ఒక మిథ్యా ఆర్థిక వ్యవస్థ, ఒక మిథ్యా రాజకీయ వ్యవస్థ రూపు దిద్దుకోసాగుతాయి. చివరకు పరిస్థితి ఎంతగా విషమిస్తుందంటే ఈ ఆధిపత్యం క్రింద మంచి నీతి నడవడిక గల శక్తులు ఊపిరి పీల్చుకోలేని దురవస్థ దాపురించే ప్రమాదం ఉంటుంది. అదలా ఉంచితే ఈ మిథ్యావ్యవస్థకు గడువు లభిస్తూ ఉంటుంది. కడకు నేలపైనా, నీటిలోనూ కల్లోల చీకటి అలుముకుంటుంది. ఈ ప్రపంచంలోని సంస్కరణా ప్రియులు, ఈ లోకంలో మళ్ళీ సంస్కరణా కార్యం చేపట్టే విషయంలో ఆశ వదులుకుంటారు. అంతలోనే అనూహ్యంగా ఒక తరుణం ఆసన్నమవుతుంది. ఓ గోప్య హస్తం ప్రస్ఫుటమై మిథ్యా వ్యవస్థనంతటినీ కుదిపివేస్తుంది. దాని ఒక్కొక్క ఇటుక చెల్లాచెదరైపోతుంది.

**"కడకు దైవప్రవక్తలు తమ జాతి జనులు విశ్వసించే విషయంలో ఆశ వదులుకున్నప్పుడు, తమకు అబద్ధపు హెచ్చరిక చేయబడిందని జాతి జనులు అనుమానిస్తున్నప్పుడు, మా సహాయం – అకస్మాత్తుగా– ప్రజలకు అందింది.** ***(యూసుఫ్ : 110)***

"వారు కుదిపి వేయబడినప్పుడు, ఆ ధాటికి తట్టుకోలేక దైవ ప్రవక్తలు, వారితోపాటు విశ్వసించినవారు, 'దైవ సహాయం ఎప్పుడు వస్తుంది?' అని ఆర్తనాదాలు చేసినప్పుడు, ఇదిగో, దైవ సహాయం సమీపంలోనే ఉంది (అని అనబడుతుంది).

ఈ సాక్ష్యాధారాలను కళ్లారా చూసిన తరువాత కూడా ఈ ప్రపంచం దానంతట అదే ఉనికిలోకి వచ్చిందనీ, దానంతట అదే నెలకొని ఉందని అనగలిగే వారెవరు? లేదా ఈ జగతిలోని అనేక శక్తులు ఒక తిరుగులేని సార్వభౌమాధికారి పర్యవేక్షణలో లేవని వాదించగల వారెవరు? ఆ తిరుగులేని సార్వభౌముని శక్తి, పరిపాలన విభజితమై ఉందని ఊహించగలవారెవరు? లేదా ఈ ప్రపంచాన్ని సృష్టించినవాడు, దానిని సృష్టించి దానిని గుడ్డిదిగా దాని మానాన వదలివేశాడని, దానిపైన ఏ నైతిక నియమావళీ పని చేయటం లేదని ఎవరయినా అనుకోగలరా? ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.


**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు
**Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# ఎన్నికల్లో ఈవీఎంల వాడకం



రూహి

**ఈవియం, వివిపాట్‌ల విషయంలో ఇప్పుడు సుప్రీంకోర్టు గట్టి చర్యలు తీసుకుంటోంది. వివిప్యాట్ అంటే వోటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్. దీని అవసరమేమిటో కాస్త చూద్దాం.**

2024 ఎన్నికల్లో వివిప్యాట్ చీటీలను కూడా లెక్కించడం జరుగుతుందా? నిజానికి 2013 సుప్రీంకోర్టు తీర్పు తర్వాతి నుంచి వివిప్యాట్ పోలింగ్ ప్రక్రియలో భాగమైపోయింది, కాని ఇప్పటి వరకు వివిప్యాట్ చీటీలను లెక్కించే ఏర్పాటు ఎందుకు చేయలేదు?

ఇప్పుడు 2024 ఎన్నికలకు సంబంధించి ఈవియంలపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎన్నికల కమీషన్ పోషిస్తున్న పాత్రను కూడా చాలా మంది విమర్శిస్తున్నారు. దేశంలో స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతున్నాయా? అలా జరిగేలా ఎన్నికల కమీషన్ పనిచేస్తుందా? అనే ప్రశ్నలు కూడా చాలా మంది అడుగుతున్నారు. ప్రతిపక్ష నేతలు 2024లో బీజేపీ గెలిస్తే ఇక ఇదే చివరి ఎన్నికలని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను కాపాడే బాధ్యత కమీషన్‌లో ఉన్న ముగ్గురు ప్రముఖులపై ఉంది. ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్. ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్, మరో ఎన్నికల కమీషనర్ సుఖ్బీర్ సింగ్ సందూ. ఈ ముగ్గురే దేశంలో ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలి. ఎన్నికల కమీషన్ అనేక చోట్ల హెల్ప్ లైన్ నెంబర్లు ఏర్పాటు చేసి ప్రజల ఫిర్యాదులు స్వీకరించే ఏర్పాటు చేసింది. భారతదేశంలో ఇప్పుడు ప్రజాస్వామ్యం చాలా సంక్లిష్ట సమయాన్ని ఎదుర్కుంటోంది. దేశంలో ఎన్నికలు అన్ని పార్టీలకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఇవ్వాలి. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల బ్యాంకు ఖాతాలు స్తంభించడం, ప్రతిపక్ష నేతలను వివిధ కేసుల క్రింద జైలుకు పంపడం లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఎలా అవుతుంది. జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ మెహతాల ధర్మాసనం ఇటీవల ఎన్నికల కమీషన్‌కు నోటీసు పంపి మే 17వ తేదీ లోపల జవాబివ్వాలని కోరింది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రైట్స్ గత సంవత్సరం మే నెలలో కోర్టులో ఒక పిటీషన్ వేశారు. ఈ సంవత్సరం మార్చిలో అరుణ్ కుమార్ అగర్వాల్ పిటీషన్ వేశారు. ఈ రెండు పిటీషన్లను కలిపి కోర్టు ఎన్నికల కమీషన్‌కు నోటీసు పంపింది. అరుణ్ కుమార్ అగర్వాల్ తన పిటీషనులో వివిప్యాట్లను 100 శాతం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికలకు ముందు కూడా ఇలాంటి పిటీషన్లు సుప్రీంకోర్టుకు వచ్చాయి. కాని అవన్నీ తిరస్కరణకు గురయ్యాయి. కాని ఇప్పుడు గోపాల్ శంకర్ నారాయణ్, నేహా రాఠీ, ప్రశాంత్ భూషణ్ తదితరులు వివిప్యాట్ కోసం గట్టి పట్టుపడుతున్నారు. ప్రతి ఈవియంకు సంబంధించిన వివిప్యాట్ చీటీలను లెక్కించాలంటున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల కమీషన్ ర్యాండమ్ పద్ధతిలా ప్రత్యేక నియోజకవర్గంలో ఏవైనా ఐదు పోలింగ్ కేంద్రాల్లోని వివిప్యాట్ చీటీలను మాత్రమే లెక్కిస్తుంది. ఇలా ర్యాండమ్‌గా కొన్ని వివిప్యాట్ల చీటీలను కాదు, మొత్తం అన్ని వివిప్యాట్ చీటీలను లెక్కించాలన్న డిమాండ్ బలంగా వస్తోంది. దీనికి చాలా సమయం పడుతుందన్నది కూడా పూర్తిగా నిజం కాదు. మహాఅయితే ఒక ఐదారు గంటల సమయం ఎక్కువ పడుతుందేమో. ఎన్నికలు పారదర్శకంగా ఉండడానికి ఇది అవసరం. కాని ఎన్నికల కమీషన్ అన్ని వివిప్యాట్ చీటీలను లెక్కించడానికి సిద్ధంగా లేదు.

ఢిల్లీలో ఈవియంలకు వ్యతిరేకంగా ప్రజలు రోడ్లపైకి వచ్చారు.

ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలు గత కొన్ని రోజులుగా మరింత బలపడుతున్నాయి. కాని ఎన్నికల కమీషన్ వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. కొందరు న్యాయవాదులు ఈవియంలను తొలగించాలని బలంగా వాదిస్తున్నారు. ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ఎన్నికల కమీషన్ నిర్వహించిన పత్రికా సమావేశంలో కూడా ఈవియం వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. కాని ప్రధాన ఎన్నికల కమీషనర్ ఈవియంలను సమర్థించుకున్నారు. 40 కన్నా ఎక్కువ న్యాయస్థానాలు ఈవియంలను సమ్మతించాయని అన్నారు. కాని ఈవియంలతో పాటు వేలాది కోట్లు ఖర్చు పెట్టి వివిప్యాట్ మెషిన్లు కూడా జతగా ఉంచాలని సుప్రీంకోర్టు ఎందుకు చెప్పిందో ఆయన మరిచిపోయినట్లున్నారు. ఇంత ఖర్చు పెట్టి వివిప్యాట్ మెషిన్లు ఏర్పాటు చేసినప్పుడు ప్రతి వివిప్యాట్ మెషీన్ చీటీలను అన్నింటిని ఎందుకు లెక్కించడం లేదు? ఎన్నికల ప్రధానాధికారి పత్రికాసమావేశంలో న్యాయస్థానాల తీర్పులు ముద్రించిన పుస్తకాన్ని ప్రదర్శించారు. ఆ తీర్పులపై ఎంతవరకు అమలు జరిగిందన్నది ప్రశ్న. కనీసం రెండు తీర్పులు చూద్దాం. సుబ్రహ్మణ్యం స్వామి వర్సెస్ ఎన్నికల కమీషన్ కేసులో తీర్పు తర్వాత వివిప్యాట్ మెషిన్లు వచ్చాయి. రెండవ తీర్పు 2019లో ప్రత్యేక నియోజకవర్గంలో ర్యాండమ్‌గా 5 పోలింగ్ కేంద్రాల్లో వివిప్యాట్ చీటీలను లెక్కించాలని చెప్పడం జరిగింది. ఇప్పుడు అనేకమంది నిపుణులు ప్రతి ఒక్క వివిప్యాట్‌లోని చీటీలను లెక్కించడం అవసరమని అంటున్నారు.

ఇప్పుడు ఈవియంలతో పాటు వివిప్యాట్ కూడా ఉన్నాయి. ప్రజలకు సందేహాలున్నాయి. ఆ సందేహాలను తీర్చడం ఎన్నికల కమీషన్ బాధ్యత. ఈవియంతో పాటు వివిప్యాట్, కంట్రోల్ యూనిట్లు కలిసి ఉంటాయి. ఈవియంలపై చాలా విమర్శలు, సందేహాలు ముందుకు వచ్చాయి. ఈవియం వద్దు బ్యాలెట్ పేపరే కావాలంటే చాలా మంది కోరుతున్నారు. కొందరు ఈవియంలు ఉన్నా పర్వాలేదు వివిప్యాట్ చీటీలన్నింటిని లెక్కించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈలోగా 2024 ఎన్నికలు వచ్చేశాయి. ఇక ఈవియంలపై ఆందోళనలు, నిరసనలకు సమయం లేదని చాలా మంది భావిస్తున్నప్పుడు సుప్రీంకోర్టు ఎన్నికల కమీషన్‌కు నోటీసు పంపించి ఈ సమస్యను తెరపైకి తెచ్చింది. 2019లో ఈ పిటీషన్ పై విచారణ తర్వాత చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్ తన తీర్పులో ప్రతి నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాల్లో వివిప్యాట్ చీటీలను లెక్కించాలని తీర్పు చెప్పారు. అంతకు ముందు కేవలం ఒకే పోలింగ్ కేంద్రంలో వివిప్యాట్ చీటీలు లెక్కించేవారు. ప్రతిపక్షాలు అప్పట్లో కనీసం నియోజకవర్గంలో 50 శాతం వివిప్యాట్ చీటీలు లెక్కించాలని డిమాండ్ చేశాయి. అప్పట్లో చంద్రబాబునాయుడు ప్రతిపక్షాలతో కలిసి ఉన్నారు. ఇప్పుడాయన ఎన్డీయేలో ఉన్నారు. రాజకీయాలు ఇలాగే మారుతుంటాయి.

2024 ఎన్నికల్లో వివిప్యాట్ యంత్రాలన్నింటిలోని చీటీలన్నింటిని లెక్కించడం జరుగుతుందా? అసలు ఎందుకు జరగదు? ప్రతి యంత్రంలోని చీటీలను లెక్కించి, ఈవియం ఓటింగుతో పోల్చడం ఏమంత కష్టం? ఈ నోటీసుకు ఎన్నికల కమీషన్ మే 17న జవాబివ్వవలసి ఉంది. కాని ఇప్పుడు ఎన్నికల్లో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డు ఉందా? అనే ప్రశ్న చాలా బలంగా వినబడుతోంది. ప్రతిపక్ష నేతలు జైలుపాలవుతున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నాయి. గోదీ మీడియాలో ప్రతిపక్షాల గురించిన వార్తలే రావు. గోదీ చానళ్ళుగా పేరుపడిన జాతీయ చానళ్ళలో కాంక్లేవ్ వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో అధికార పక్షానికి చెందిన నేతలు పెద్ద ఉపన్యాసాల వంటి ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. వారిని ప్రశ్నించే జర్నలిస్టులు అక్కడ ఎవ్వరు లేరు. ఇప్పుడు కేవలం 2024 ఎన్నికల గురించి బీజేపీ నేతలు మాట్లాడడం లేదు. 2047 ఎన్నికల గురించి మాట్లాడుతున్నారు. అసలు 2024 ఎన్నికలు తామే గెలిచేసిన పద్ధతిలో మాట్లాడుతున్నారు. ఇప్పుడు కేవలం 2047 ఎన్నికల గురించి చర్చించడమే ప్రధానం అన్నట్లు మాట్లాడుతున్నారు. బీజేపీకి వేగంగా పరుగెత్తడానికి కావలసిన బూట్లు, బూస్టరు డోసుల వంటి మందులు అన్ని ఉన్నాయి. ప్రతిపక్షాల కాళ్ళు చేతులు కట్టిపడేసి పరుగుపందెం అంటున్నారు. ఈ పరిస్థితిలో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ కనిపించడమే లేదు.

ఈవియం, వివిప్యాట్లకు సంబంధించి మాట్లాడుకుందాం. ప్రతి ఈవియంకు వివిప్యాట్ మెషిన్ అనుసంధానించబడి ఉన్నప్పుడు వివిప్యాట్ చీటీలను ఎందుకు లెక్కపెట్టడం లేదు. దీనికి

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పొదురాయి
గీటురాయి
వారపత్రిక

సమయం ఎక్కువ పడుతుంటే, మంచిదే ఎంత సమయం అవసరమైతే అంత సమయం వెచ్చించాలి. ఒక ఐదారు రోజులు ఆలస్యమైతే మునిగిపోయే కొంపలేమున్నాయి? ఐదేళ్ళ పాటు దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలివి. ఏడు విడతలుగా ఎన్నికలు జరుగుతున్నాయి. త్వరత్వరగా జరిపించేశాయాలన్న తొందరేమీ ఎన్నికల తేదీల నిర్ణయంలో లేదు. మొదటి విడత ఎన్నికలు ఏప్రిల్ 19న జరుగుతున్నాయి. ఈ రోజు పోలింగులో ఓటు వేసిన ఓటర్లు జూన్ 4వ తేదీ వరకు అంటే 46 రోజులు వేచి ఉన్న తర్వాత మాత్రమే ఎవరు గెలిచారో తెలుసుకోగలరు. చివరి విడత పోలింగ్ జూన్ 1వ తేదీన జరుగుతుంది. ఆ రోజు ఓటు వేసిన వాళ్ళకు కూడా జూన్ 4 వరకు వేచి ఉండాల్సిందే. పోలింగ్ తర్వాత సాధారణ ప్రజలు ఫలితాలు తెలుసుకోడానికి నాలుగు రోజుల నుంచి నలభై రోజుల వరకు వేచి ఉండే పరిస్థితి ఎలాగూ ఉంది. అలాంటప్పుడు మరో ఐదారు రోజులు ఎక్కువ పట్టినా పెద్ద సమస్యేం ఉంది. అందువల్ల ఫలితాల ప్రకటనలో ఆలస్యమవుతుందని వివిప్యాట్ చీటీలను లెక్కించకపోవడం అనేది మూర్ఖత్వం తప్ప మరేమీ కాదు. దేశంలో ప్రతిపక్షాలుగా ఉన్న పార్టీలకు దేశప్రజల్లో 60 శాతం మంది ఓటేశారన్నది మరిచిపోరాదు. అయినా ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలను అస్సలు పట్టించుకోకపోవడం ఎంతవరకు సబబు. వివిప్యాట్‌ల విషయంలో ప్రతిపక్షాలతో ఎన్నికల కమీషన్ ఎందుకు సమావేశం అవ్వలేదు. గత సంవత్సరం జూన్ నుంచి ఎన్నికల కమీషన్ ను కలిసి మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నామని కాంగ్రెసు నాయకుడు జైరాం రమేష్ చెప్పారు. కాని ప్రతిపక్షాలకు ఎన్నికల కమీషన్ టైమివ్వడం లేదు. ఏడాదిగా ప్రతిపక్షాలు వివిప్యాట్ చీటీలు లెక్కించాలని కోరుతున్నాయి. కాని ఎన్నికల కమీషన్ పట్టించుకోలేదు. ఇప్పుడు కోర్టు నోటీసు పంపించింది. ఈవియంలలో వందశాతం వివిప్యాట్ మెషిన్లు అనుసంధానించాలని, ప్రతి ఒక్క వివిప్యాట్ లో చీటీలను లెక్కించాలని డిమాండ్ పెరుగుతోంది. కాని ఎన్నికల కమీషన్ వివిప్యాట్ విషయంలో తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి అన్నట్లు వ్యవహరిస్తోంది. ప్రతిపక్షాలు పూర్తిగా ఈవియంకు వ్యతిరేకంగా లేవు. కాని ఈవియంలో పారదర్శకత లేకపోవడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈవియంల వ్యవహారంలో అవకతవకలను వ్యతిరేకిస్తున్నాయి. వివిప్యాట్‌లు అనుసంధానం చేసిన ఈవియంల వ్యవహారం కూడా చాలా విచిత్రం. కేవలం 7 సెకన్ల పాటు మాత్రమే ఎవరికి ఓటు పడిందో చూపిస్తుంది. ఆ తర్వాత ఎవరికీ ఏదీ కనిపించదు. ఆ ఓటు కౌంటింగులో వచ్చిందో లేదో కూడా ఎవరికీ తెలియదు. వివిప్యాట్‌ను వెరిఫై చేయడం ఎలా? వివిప్యాట్ నుంచి ఒక రసీదు ఓటరుకు అందేలా ఉండాలి. తాను వేసిన ఓటు తాను అనుకున్న అభ్యర్థికే పడిందని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు దాన్ని బ్యాలెట్ బాక్సులో వేసేలా ఉండాలి. వివిప్యాట్లు పని చేయడం లేదని, లోపాలున్నాయని విమర్శలు వచ్చాయి. కాని వీటిని ఎన్నికల కమీషన్ అస్సలు పట్టించుకోలేదు. ప్రతిపక్షాలు ఎంత మొత్తుకున్న వినని ఎన్నికల కమీషన్ ఇప్పుడు సుప్రీంకోర్టు నోటీసుకు జవాబియ్యవలసి వచ్చింది. ఈవియంల విషయంలో 2013 స్వామి కేసులో అసలు సమస్య ఏమిటంటే, ఎవరికి ఓటు వేయాలనుకున్నారో వారికే ఓటు పడినట్లు నిర్ధారణ ఎలా? అన్నది. ఈ నిర్ధారణ కోసమే వివిప్యాట్ వచ్చింది. వివిప్యాట్ అంటే వోటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రెయిల్. ఇందులో వెరిఫికేషనుతో పాటు పేపరు ఆడిట్ కూడా ఉంది. అంటే ఓటింగు తర్వాత పద్ధతి ప్రకారం ఏ చీటిని ఓటరు చూసి నిర్ధారణ చేసుకున్నాడో ఆ చీటీలనే లెక్కించాలి. కాని లెక్కించేది వివిప్యాట్ లోని చీటీలను కాదు. ఈవియంలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు. లెక్కించే ఓట్లు వేరు, చూపించే ఓట్లు వేరు అయినప్పుడు ఈ వివిప్యాట్ యంత్రాలు అలంకరణ కోసం అక్కడ పెట్టడం ఎందుకు? ఈవియంలో అవకతవకలు ఆపడానికి వివిప్యాట్ వచ్చింది. వివిప్యాట్ అన్ని ఈవియంలకు పెట్టేసి, వివిప్యాట్ చీటీలు లెక్కించడానికి సంకోచాలెందుకు? వివిప్యాట్ మెషీన్ల కోసం వేలకోట్లు ఖర్చయ్యాయి. వివిప్యాట్ ఉపయోగిస్తున్నప్పుడు ఆ చీటీలను లెక్కించి ఎన్నికల ఫలితాలను ప్రకటించడమే సరయిన పద్ధతి. వివిప్యాట్లను ఉపయోగించడం ఎంత అవసరమంటే, ఈవియంల అవకతవకలపై అనేకవార్తలు వచ్చాయి. 2019 ఎన్నికల్లో పూనమ్ అగర్వాల్ క్వింట్ కోసం రాసిన వార్త ప్రకారం తమిళనాడు కంచీపురం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య కన్నా 18 వేలకు పైగా ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి. ఈవియంల మహత్యం ఇది. ధర్మపురి నియోజకవర్గంలో కూడా 17వేల కన్నా ఎక్కువ ఓట్లు అధికంగా పోలయ్యాయి. దీనిపై ఎన్నికల కమీషన్ నోరిప్పలేదు. ఈవియంలు సరిగా పనిచేయడం లేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే, టెస్టు జరిగినప్పుడు ఈవియం సరిగా పనిచేస్తే ఫిర్యాదు చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష పడుతుంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే చర్చ చాలా హుషారుగా చేస్తుంటారు కాని వివిప్యాట్ విషయంలో నోరిప్పరు. మీడియాలో కూడా ఈ వార్త రాదు. ఈవియం అవకతవకలు, వివిప్యాట్లపై చర్చ ఇవన్నీ ప్రజల ముందుకు రాకుండా తొక్కిపెట్టడానికే ఒకే దేశం, ఒకే ఎన్నిక లాంటి చర్చలు తీసుకువస్తుంటారు. ఎన్నికల కమీషన్ ఎన్నికల తర్వాత వివిప్యాట్ డాటాను ఏడాది పాటు భద్రంగా ఉంచాలి. కాని 2019 ఎన్నికల తర్వాత వివిప్యాట్ చీటీలను నాలుగు నెలలోనే ధ్వంసం చేసింది. 2024 ఎన్నికల్లో వివిప్యాట్లపై ఎన్నికల కమీషన్ ఎలా వ్యవహరిస్తుందో, కోర్టుకు ఏమి జవాబిస్తుందో వేచి చూద్దాం.




**ప్రభావవంతులం** అవ్వాలంటే 'అలవాటు' అనేది ఒక్కసారిగా అలవడేది కాదు. తెలిసో తెలియకో ఒక పనిని మాటి మాటికీ చేస్తూ గాడిలో పడిన సత్ప్రవర్తన, గాడి తప్పిన దుష్ప్రవర్తన- దాన్ని అలవాటుగా అభివర్ణిస్తారు. అలవాటు అనేది పూర్తిగా మానసికమయినా, పరిసరాలు, వాతావరణం, పరివారం, వ్యక్తులు, స్నేహితులు, ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులు అలవాట్లపై బలమయిన ప్రభావాన్ని చూపుతాయి. ప్రతిభా వంతులను ప్రేరణగా తీసుకొని మనల్ని సయితం ప్రభావ వంతుల జాబితాలో చేర్చ గలిగే సప్త సూత్రాలను అందజేసే ఓ చిరు ప్రయత్నమే ఈ వ్యాసం. పాఠక మహోదయులకు మేలు చేస్తుందని నమ్మకం.

అలవాటును మనం చిరు మంటతో పోల్చ వచ్చు. చీకటిలో దారి చూపించడానికీ పని కొస్తుంది. చలి కాచుకోవడానికీ పనికొస్తుంది. అదే అదుపు తప్పితే మనిషి జీవితానికి చితి పేర్చి భస్మీపటం కూడా చేస్తుంది. కొన్ని సందర్భాలలో మనం ఒక అలవాటుకు బానిసలం అయి పోతాము కానీ మనకు దాని స్పృహ కూడా ఉండదు. ఉదాహరణకు ఒకరికి టైమ్ మేనేజ్‌మెంట్ కన్నా టైమ్ పాస్ ఇష్టం. ఒకరికి మౌనం కన్నా వాగుడు ఇష్టం. ఒకరికి ఏ ఒక్క విషయం మీద ఫోకస్ ఉండదు. అతను ఏ పని మీద మనసును లగ్నం చెయ్యలేడు. విచిత్రం ఏమింటే, ఇదో చెడ్డ అలవాటుగా మారిందన్న విషయం బహుశా ఆ వ్యక్తికి కూడా తెలియక పోవచ్చు. తెలిసి తెలియక మనం ఏర్పరచుకునే కొన్ని అలవాట్లు మనల్ని రాజుగా చేసి నిలబెట్టనయినా నిలబెడతాయి లేదా ఒక్తి బానిసగానయినా మార్చివేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, మనలో నాలుగు మంచి అలవాట్లు ఉన్నాయి అంటే మన భవిత బంగారం అయ్యే అవకాశాలు ఉన్నాయి. అదే మనలో ఓ నాలుగు చెడ్డ అలవాట్లు ఉన్నట్లయితే మన భవిష్యత్తు అంధకార బంధురం అయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాసంలో పేర్కొనబడిన సప్త సూత్రాలను మన అలవాటుగా మార్చుకోగలిగితే- మనం, మన పిల్లలూ వెన్నుముక వ్యక్తిత్వం గల వ్యక్తులుగా ఎదిగే అవకాశం ఉంది. మనల్ని మనం అంచనా వేసుకోగలగడమే కాక, అన్యులను సయితం అంచనా కట్టే సామర్థ్యం మనకు అలవడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

### మొదటి సూత్రం: ఆరంభించు!

మనం పుడమిపై పాదం మోపింది మొదలు మళ్ళీ పుడమి పాలయ్యేంత వరకూ మన జీవితంలో సంక్షోభాలు, సందిగ్ధాలు, ఆరాటాలు, పొందటాలు, పోగొట్టుకోవడాలు అవిభాజ్యాలయి ఉంటాయి. జీవితమనే ఈ చదరంగంలో అనుక్షణం చురుగ్గా అక్టివ్‌గా ఉండాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరికి ఉంటుంది. ఇది గ్రహించలేని స్థితిలో ఉన్న మందబుద్ధులు కొందరు అనుదినం

అవమానాల పాలవుతూ ఉంటారు. ఎన్ని సార్లు హెచ్చరించినా, ఎన్ని సార్లు శిక్షించినా దుస్థితిని దూరం చేసుకునే, తిరోగతిని పురోగతిగా మార్చుకునే ప్రయత్నం చెయ్యరు. అలాంటి వారిని గురించి "ఆరభింపరు నీచ మానువులు" అన్నాడు భాతృహరి.

అవును, నీచులు- విఘ్న భయంతో ప్రారంభించరు. మధ్యములు- ప్రారంభిస్తారు. విఘ్నం కలిగితే మానేస్తారు. ధీరులు-ఎన్ని విఘ్నాలు కలిగినా ఆరంభించిన కార్యాన్ని పూర్తి చేసి తీరతారు. కాబట్టి ప్రయత్నించాలి, ప్రయత్నించాలి, ప్రయత్నిస్తూనే ఉండాలి. ప్రయత్నించని వాడు ఓడి పోయే అవకాశం లేదు. కాని ప్రయత్నించిన వాడు 99 సార్లు ఓడిపోతాడు, ఒక్కసారి గెలవడానికి. "నిన్నటి పనిని ఈ రోజే చెయ్యి, ఈ రోజు పనిని ఇప్పుడే చెయ్యి" అన్న ప్రభావవంతుల మాటను ఆచరణలో పెట్టి ప్రభావవంతులుగా ఎదగాల్సిన ఎందరో అసలు పనిని ప్రారంభించరు. వాయిదాల వ్యాధితో నిరతం సతమతమవుతూ ఉంటారు. ప్రాణం మీదికి వస్తేగానీ ప్రారంభించరు. ఇలాంటి వారికి జీవితంలో ఏదయినా ఛాలెంజ్ ఎదురయితే ఆక్టివ్ అవ్వాల్సింది పోయి రియాక్టివ్ అవుతారు.

క్రికెట్ భాషలో అర్థం చేసుకోవాలంటే, బ్యాట్‌మెన్ ముందస్తుగానే బ్యాట్ పట్టుకొని వచ్చే బాలు కోసం తీక్షణంగా ఎదురు చూస్తూ ఉంటే, చౌకా గానీ, ఛక్కా గానీ కొట్టే అవకాశం ఉంటుంది. బాలు వచ్చాక చూసుకుందాంలే అని నిర్లక్ష్య ధోరణితో ఉంటే, క్లీన్ బౌల్డ్ అవ్వడమో, అవుట్ అవ్వడమో ఖాయం. అలాగే సంసారమనే సమర క్షేత్రంలో కేరీర్ పరంగా, ఫ్యూచర్ పరంగా, విద్యా పరంగా ఆయా రంగాలను కావాల్సిన సరంజామాతో యుద్ధం చెయ్యడానికి మనం సదా సిద్ధంగా ఉండాలి. తుఫాను రాక ముందే నౌకను సిద్ధం చేసుకోవాలి. మనకు మన మానం, మర్యాదల పట్ల ఏ కాసింత గౌరవమున్నా మనం ఓ సత్కార్యానికి శ్రీకారం చుట్టాలి. ఈ క్షణం నుంచే ఓ గొప్ప పనిని ప్రారంభించాలి.

## రెండవ సూత్రం : ముగింపు ముఖ్యం

ఒక పనిని అట్టహాసంగా ప్రారంభిస్తే సరిపోదు. దానికి సరయిన ముగింపు కూడా చెప్పగలగాలి. మనం శ్రీకారం చుట్టిన కార్య చివరి పరిణామం ఎలా ఉంటుంది? అన్న అవగాహన మనకుండాలి. 'ఫలాన్ని, ఫలితాన్ని ఆశించకుండా పని చేసుకుంటూ వెళ్లు' అన్న మాట అది నమ్మే కొందరికి వదలి పెట్టి మనం మాత్రం ఫలితం మీద దృష్టిని కేంద్రీకరించాలి. ఫలం, ఫలితం ఎలా ఉండబోతుంది అన్న అవగాహన ఉన్నప్పుడే మనం చురుగ్గా పనిని పూర్తి చెయ్యగలం. అలా కాక, ఫలితం విషయంలో స్పష్టత కొరవడితే, పడిన శ్రమకి అసలు ఫలితం దక్కుతుందో లేదో తెలియకపోతే అలాంటి పనిని మనం మన శ్వాసగా మార్చుకోవడం, ఒక అలవాటుగా చేసుకోవడం సాధ్యం కాదు. అలాంటి పని కోసం ధన, మాన, ప్రాణ త్యాగం కాదు కదా, దోమ త్యాగానికి కూడా మనిషి సిద్ధమవ్వడు. ఆలోచనా పరుల వద్ద ఒక విజన్, దార్శనికత, దూరదృష్టి, లక్ష్యంపై గురి ఉంటుంది. విజన్ ఉన్న వ్యక్తి ఆలోచనలు ఎంతో ఉన్నతంగా ఉంటాయి. ఉత్తమ ఆశయాలకనుగుణంగా వారి కార్యప్రణాళిక ఉంటుంది గనక అనితర సాధ్య విజయాలు వారికి సాధ్యమవుతాయి. స్టూడెంట్స్ భాషలో చెప్పాలంటే, ఒక విద్యార్థికి తన భవిత మీద స్పష్టత లేదు గానీ, మంచి కాలేజీలో మాత్రం జాయిన్ అయ్యాడు. ప్రతిఫలం తెలిసిందే. అదే ఒక విద్యార్థికి తానేం అవ్వాలనుకుంటున్నాడో స్పష్టత ఉంది ఇంజనీరో, డాక్టరో. అతను దానికనుగుణంగా కష్టపడి ఫలితాన్ని తనకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంటుంది.

విజన్ అనేది బయట ప్రపంచానికి చూపించగలిగేది కాదు. ప్రతి ఒక్కరి కల వేర్వేరుగా ఉంటుంది. కొందరి కలలు ఇంకొందరికి అర్థ రహితంగా, అసంపూర్ణంగా తోచే అవకాశం ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే విజన్ అనేది మనల్ని చైతన్య వంతుల్ని చేసే ఒక అంతర్లీన ప్రేరణ.

## మూడవ సూత్రం : ప్రధానం - అప్రధానం

ప్రభావవంతుల జీవితాల్లో దేనికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి అన్న అవగాహన ఉంటుంది. దేన్ని ముందు చెయ్యాలి? దేన్ని కాస్త తర్వాత చేసినా ఫర్వాలేదు అన్న స్పష్టత ఉంటుంది. అనేక పనులు, అనేక పరిచయాలు ఏమంత ప్రాధాన్యం గలవయి ఉండవు. తర్వాత చెయ్యాల్సిన పనులను ముందే చేసి, ముందు చెయ్యాల్సిన పనులను తర్వాత చేస్తే వచ్చే తలనొప్పి సమస్య వీరికుండదు. కాబట్టి వీరి జీవితంలో వాయిదాల వ్యాధికి చోటులేదు. ఉదాహరణకు ఒక విద్యార్థి తన విద్యా విషయమయి అనుక్షణం అప్రమత్తంగా ఉండకుండా, అన్య విషయాలలో ఎంతో చురుకుగా ఉన్నాడు అంటే అతను తన ప్రాధ్యాన్యతలకు విలువ ఇవ్వడం లేదన్న మాట. తత్కారణంగా తన విద్యకు సయితం ఒక దశలో స్వస్తి పలికే అవకాశం ఉంటుంది. ఏ విషయాలు మరే విలువలు లేకుండా మన జీవితాన్ని ఊహించుకోవడం కష్టమో అలాంటి వాటికి మనం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి.

## నాల్గవ సూత్రం: గెలుద్దాం! గెలిపిద్దాం!!

నేను గెలవాలి, నా తోటివారు గెలవాలి అనుకోవడం ఆలోచనా పరుల లక్షణం. నేను మాత్రమే గెలవాలి అనుకోవడం దురాలోచనా పరుల లక్షణం. వీరి ఆలోచన ఎలా ఉంటుందంటే, వారు గెలిచినందుకు కలిగే ఆనందం కన్నా సాటి వారు ఓడి పోయారు అన్న పైశాచికానందమే ఎక్కువగా ఉంటుంది. దీనికి భిన్నంగా ప్రభావవంతమయిన వ్యక్తిత్వం గలవారు- 'నేను లాభపడాలి, నా తోటి వారూ లాభపడాలి' అని ఆలోచిస్తారు. ఇలాంటి సాత్విక ఆలోచన కారణంగా ప్రజల మధ్య బంధం మరింత బలోపేతం అవుతుంది. తమ విజయాన్ని కోరుకునే వ్యక్తి చుట్టూ ప్రజలు గుమిగూడుతారు. ఉదాహరణకు : ఒక కాలేజీ నడిపే ప్రిన్సిపాల్‌గానీ, అధికారిగానీ స్టూడెంట్స్ నుండి అందే ఫీజు తనకు మాత్రమే చెందాలి. నయా పైసా ఎవ్వరికి ఇచ్చేది లేదు అంటే, పని చెయ్యాలనుకున్న వారు ఉచితంగానే పని చెయ్యాలి అంటే అలాంటి కళాశాల మూతపడటానికి ఎక్కువ కాలం ఏమీ పట్టదు.

జీవితంలో మనం ఓ ప్రాథమిక సూత్రాన్ని ముడివేసి పెట్టుకోవాలి. ఎందులోనయితే మనం మన మేలును కోరుకుంటామో అందులో అన్యుల మేలుని సయితం కాంక్షించాలి. అలా కాంక్షించమని స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పారు: "నీ కొసం దేన్నయితే నువ్వు ఇష్ట పడతావో దాన్నే నీ సోదరుని కోసం ఇష్టపడు". (బుఖారీ, ముస్లిం)

మనకు జీవితంలో ఎవరి ద్వారానయినా మేలు జరిగి ఉంటే మనం వారిని గుర్తు పెట్టుకొని దానికి మించి లేదా అదే స్థాయి మేలు చేసే ప్రయత్నం చెయ్యాలి.

## అయిదవ సూత్రం : అర్థం చేసుకున్న తర్వాతే అర్థం అయ్యింది అనాలి

ప్రపంచంలో అత్యంత కీలకాంశం ప్రజా సంబంధాలు. మనలో సాటి ప్రజలను అర్థం చేసుకునే నైపుణ్యం గనక ఉన్నట్లయితే మనం విజయం సాధించినట్లే. ప్రజల సంస్కృతిని, వారి మనస్తత్వా లను, వారి అలవాట్లను, వారి రీతి రివాజులను అర్థం చేసుకోవడం మన విజయంలో కీలక పాత్ర పోషిస్తుంది. కేవలం అవగాహన వరకే పరిమితం అవ్వక వారి సమస్యలను పట్టించుకోవాలి, పరిష్కరించే ప్రయత్నం చెయ్యాలి. అంటే బాగుండాలనుకునే సమాజంలో ఒకరి బాగును కోరుకునే వారం మనం అవ్వాలి. దీనికి భిన్నంగా ఒక సమాజం గురించి, ఒక దేశం గురించి, ఒక ప్రాంతపు ప్రజల రాతా రీతులు గురించి ఎంత చదివినా, ఎన్ని సర్వేలు జరిపినా, ఎన్ని కమీటీలు ఏర్పాటు చేసినా ప్రజల పట్ల మన అవగాహన అంతంత మాత్రమే ఉంటుంది. జంతు భాషలో దీన్ని అర్థం చేసుకోవాలంటే, సింహం గడ్డి తినదు. అది మాంసమే తింటుంది. చాలా మంది వ్యక్తులు సింహానికి కూడా గడ్డి వేసే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అదీ ఆహారమే కదా అన్నది వారి వాదన. దీన్ని బట్టి తేటతెల్లమయ్యేది ఏమిటంటే, ఎవరికి ఎవరిని గురించి ఎంత అవగాహన ఉంటుందో వారు అవతలి వారితో అంతే జాగ్రత్తగా మసలుకునే అవకాశం ఉంటుంది.

## ఆరవ సూత్రం: శక్తివంతమయిన జట్టు

మనిషి సంఘ జీవి. ఒంటరిగా ఏదీ సాధించలేడు, ప్రగతి, పురోభివృద్ధి, వికాసం అనేది ఒక శక్తివంతమయిన జట్టు ద్వారానే సాధ్యమవుతుంది. ఎవరయితే జీవితంలో ఒక జట్టును ఏర్పాటు చేసుకోవడంలో సఫలమవుతారో వారిలో మహా గొప్ప ప్రతిభ, నాయకత్వ లక్షణం ఉందని అర్థం. మన ఉత్తమ ఆశయాల పరిపూర్తికై ప్రజల్ని ప్రోగు చేసుకో గలిగితే, వారి మనోభావాలను అంచనా కట్టగలిగితే, వారి అవసరాలను మనతో జోడించుకో గలిగితే మనం లీడర్‌గా ఎదగ గలం. అంటే ఒక నాయకుడిలోని శక్తి, ఎనర్జీని జట్టులోని ప్రతి ఒక్క వ్యక్తిలో నింపగలిగితే అది సైనర్జీ అనబడుతుంది. ఇది ఒక వ్యక్తిగా కాకుండా మహా శక్తిగా రూపొందుతుంది.

ఇలాంటి ఒక జట్టు ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకోవడంలో తప్పు లేదు. కానీ, దానికి తగ్గట్టు మనలో అటువంటి అకుంఠిత దీక్ష, అవిరళ పరిశ్రమ, అంకిత భావం ఉండాలి. వారు మనల్ని తమ పాలిట అభయ క్షేత్రంగా భావించ గలగాలి. అన్యులను భరించగలిగే సహిష్ణుత, సుహృద్భావం మనలో ఉండాలి. మనం ఒక్కరమే నడవటం కాదు మనతోపాటు సాటి వారిని సయితం నడిపించగలగాలి. దానికి మనం ఎదుటి వారిని పెద్ద మనసుతో మన్నించగలగాలి. వారి కలలను మన కలలుగా భావించేంతటి మంచి సంస్కారం మనకుండాలి. వారి ప్రాధాన్యతలను మన ప్రాధాన్యతలుగా భావించి స్పదించగలిగే గొప్ప దార్శనికత మనలో ఉండాలి. ఇది గనక మనం చెయ్య గలిగితే మనం ప్రభావవంతుల జాబితాలో చోటు దక్కించు కోవడం సుసాధ్యం.

## ఏడవ సూత్రం: మన ఆయుధాలను పదును పెట్టుకోవాలి

మనం ప్రతి దినం, అనునిత్యం ప్రవర్థమానం అవుతూ, ఎదుగుతూ ఉండాలి. అలా జరగడం లేదంటే, మనం ప్రభావ వంతమయిన వ్యక్తులం కాలేము.

**స్వీయ అభివృద్ధికి మొదటి చిట్కా:**

స్వీయ అభివృది అనేది స్వీయ ఆలోచన, ఆత్మ పరిశీలనతోనే మొదలవుతుంది. మనం మన అలవాట్లను సమీకరించుకోవాలి. మన ప్రతిభను మెరుగుపర్చుకోవాలి, మన మనస్తత్వాన్ని బేరీజు వేసుకోవాలి. మనం ఎక్కడికి వెళుతున్నాము? మనం ఏం చేస్తున్నాము? మనం ఏం చెయ్యాలి? మనం ఇక్కడ, ఈ సమయంలో ఎందుకు వచ్చాము? మనకంటూ ఒక లక్ష్యం ఉందా? లేదా? ఒకవేళ లక్ష్య రహిత జీవితం మనం జీవించడం లేదు కదా? మన జీవితం బూడిదలో పోసిన పన్నీరయితే కావడం లేదు కదా? అన్న ఆత్మ విమర్శ మనలో బయలు దేరాలి.

**రెండవ చిట్కా:** పుస్తక పఠనం. మనకు అత్యవసరమయిన పుస్తకం మాత్రమే కాకుండా వేరే మంచి సాహిత్యం అనబడే ఇతర పుస్తకాలను సయితం చదువుతూ ఉండాలి. మనకవసరమయిన పుస్తకం ఎలాగో మనం చదువుతాం, చదివి తీరాల్సిందే. అదే మంచి సాహిత్యం నిత్యం మన అధ్యయనంలో అవిభాజ్యాంశం అయితే, కొత్త కోణం, కొత్త విషయం, కొత్త స్కిల్స్ తెలిసే అవకాశం ఉంటుంది. అప్పుడప్పుడూ అవసరమయిన పుస్తక పఠనంతోపాటు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పుస్తకాలను సయితం చదువుతూ ఉండాలి. వివిధ రకాల కోర్సుల్లో తరచూ పాల్గొంటూ ఉండాలి. సెమినార్స్, సభలు, సమావేశాలలో పాల్గొంటూ ఉండాలి. ఆయా సమావేశాలలో, సెమినార్లలోని ముఖ్యమయిన అంశాల్ని నోట్ చేసుకోవడం అలవాటు చేసుకుంటే గొప్ప ప్రయోజనం చేకూరుతుంది. అలా మనం చేసిన నాడు రొటీన్ లైఫ్ బోరు కొడుతుంది అన్న షికాయతు ఉండదు. ప్రతి రోజు మనం ఒక కొత్త ప్రపంచలో జీవిస్తాము. మనలో నేర్చుకునే ఉత్సాహం నీరు గారకుండా చూసుకోవాలి. మన కలలు తుప్పు పట్టకుండా జాగ్రత్త పడాలి. మన బంగారు భవిష్యత్తుకై మనం వేటినయితే అనునిత్యం, అనుక్షణం ఉపయోగిస్తూ ఉంటామో వాటికి తుప్పు పట్టకుండా జాగ్రత్త పడాలి.

మనం బుడి బుడి అడుగులతో పడుతూ లేస్తూనే నడక నేర్చాము. నడుస్తూ నడుస్తూనే పరుగెత్తడం అలవాటయింది. అదే మనం పుట్టినప్పటి స్థితిలోనే ఇప్పటికీ పడి ఉండి ఉంటే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! కాబట్టి మనం నిత్య నూతనంగా తయారవుతూ హుషారుగా ఉండాలి. ఇప్పటి వరకు చెప్పబడిన విషయాలు కేవలం చదవడం, వినడం ద్వారా అలవడవు. వాటి స్ఫూర్తిగా మనం మనల్ని ఎదిగేందుకు శక్తి వంచన లేకుండా కష్టపడాలి. ఎందుకంటే, 50, 60 యేండ్ల వయసు గల ఏ భిక్షగాడిని నీ జీవితంలో ఇలాంటి ఒక రోజు వస్తుందని ముందే ఊహించావా? అని అడిగితే లేదనే సమాధానం చెబుతాడు. కాబట్టి ఈ రోజు, ఈ క్షణం ఈ ఘడియ మాత్రమే మనది. సమయమనే ఈ అపార సంపదను గనక మనం సద్వినియోగ పర్చుకోగలిగితే విజశ్రీ మన కాళ్ళు పడుతుంది.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ధీర వనితలు

- తహ్‌సీన్ హుమైరవి

ఇస్లాం ఆజ్ఞలు పురుషులకు ఎలా వర్తిస్తాయో స్త్రీలకు కూడా అలాగే వర్తిస్తాయి. దైవాజ్ఞలు పాటించడంలో స్త్రీలు పురుషులు అన్న తేడా లేదు. పురుషులు తమ కర్మలకు ఎలా బాధ్యులో, స్త్రీలు కూడా తమ కర్మలకు దైవం ముందు అలాగే బాధ్యులు. అందుకే నాటి ముస్లిం మహిళలు దైవప్రసన్నత పొందడానికి అన్నింటికంటే ముఖ్యమైన మార్గం ధర్మ సంస్థాపన కృషిలో పురుషులతోపాటు తమ వంతు పాత్ర పోషించారు.

ఈ మహా కార్యంలో మగవారికి దీటుగా మహిళలు పోషించిన పాత్ర చిరస్మరణీయం, అనిర్వచనీయం కూడాను. ధర్మంపై వారి స్థిరత్వం, దృఢ విశ్వాసం, బద్ధ శత్రువులను సైతం కదిలించి వేసింది. ఓ వైపు తమ కుటుంబాన్ని చక్కబెట్టుకుంటూనే సందేశ ప్రచారంలోను, సమాజ సేవలోను, రాజకీయాల్లోను, పాలనాధికారాల్లోను, చివరకు రణరంగంలో కూడా వైవిధ్యమైన ధైర్య సాహసాలు ప్రదర్శించిన ధీరవనితలు వారు. వారి జీవిత ఘట్టాలు మనలో దృఢ విశ్వాసం, నూతనోత్సాహం కలిగిస్తాయి. అలాంటి మచ్చుతునకలు కొన్ని మన కోసం.....

## తడబడని అడుగులు

సత్య ధర్మంపై స్థిరంగా నిలిచిన బానిసల్లో బిలాల్(రజి), ఖబ్బాబ్ (రజి), యాసిర్ (రజి)లతో పాటు యాసిర్(రజి) సతీమణి, సుమయ్యా(రజి) కూడా ఉన్నారు. ముసలి తనంతో బలహీనురాలు అయినా ఆవిడను ఎన్నో విధాలుగా బాధ పెట్టేవారు. మిట్ట మధ్యాహ్నం వేళ బాగా వేడెక్కిన ఇసుక నేలపై పడుకోబెట్టి, చిత్రహింసలకు గురి చేసేవారు. కానీ ఏ యాతన ఆమెను సత్యధర్మం నుండి ఒక ఇంచు కూడా కదిలించలేక పోయింది. ప్రవక్త మహనీయులు (సఅసం) అట్నుంచి వెళతూ ఓ యాసిర్ కుటుంబీకుల్లారా! సహనం వహించండి. స్వర్గంలో కలుసుకుందామని ఓదార్చేవారు. అబూ జహల్ ఆమెను అతి కిరాతకంగా బల్లెంతో పొడిచి చంపేశాడు. ధర్మోన్నతి కోసం ప్రాణాలర్పించిన తొలి వీరవనితగా నిలిచారామె..

దైవప్రవక్త (సఅసం) వల్ల నగరంలో గందర గోళం, గజిబిజి నెలకొందని తలచి ఆయన్ను అంతమొందించాలనే సంకల్పంతో హజ్రత్ ఉమర్(రజి) బయల్దేరారు. దార్లో తన తోబుట్టువు ఫాతిమా (రజి), ఆమె భర్త సయీద్(రజి) ఇస్లామ్ స్వీకరించారని తెలిసింది. ఇంకేముంది కోపంతో ఊగిపోయారు. బావతోపాటు అడ్డొచ్చిన చెల్లిని సైతం విపరీతంగా బాదారు. రక్తపు మడుగులో ముద్దగా మారిన ఆ చెల్లాయి "అవును! మేము దైవాన్ని, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించాము. నీ చేతనైంది చేస్కో" అన్నారు. ఆ మాటలు ఆయన్ను కదిలించి వేశాయి. మూసుకుపోయిన ఉమర్ హృదయ ఫలకం జ్ఞానకాంతితో వికసించింది.

## విద్యావికాసాలు

ఒక్కోసారి మనిషి మాట తీరు వల్ల జరగాల్సిన పనులు కూడా జరక్కుండాపోతాయి. మాటల్లో నేర్పరితనం, సమయ స్ఫూర్తి, ఎదుటి వ్యక్తి స్థాయినిబట్టి మన వ్యవహార శైలి ఉన్నప్పుడే పనులు జరుగుతాయి. అలా కానప్పుడు పర్యవసానం భిన్నంగా ఉంటుంది. హజ్రత్ అస్మా(రజి) నేర్పరితనాన్ని ప్రవక్త మహనీయులు ఎలా మెచ్చుకొన్నారో చూడండి.

ఒకసారి కొందరు స్త్రీలు హజ్రత్ అస్మాబిన్తె జైద్(రజి)ను తమ ప్రతినిధిగా చేసి దైవ ప్రవక్త(స) వద్దకు పంపారు. ఆమె ఆయనతో ఇలా విన్నవించుకున్నారు. "ముస్లిం స్త్రీల సమూహం తరపున నేను మీ వద్దకు రాయబారిగా వచ్చాను వారంతా నా వెనకే ఉన్నారు. నేను చెబుతున్న విషయాన్నే వారూ చెప్పాలనుకుంటున్నారు. నా అభిప్రాయమే వారి అభిప్రా యం. అల్లాహ్ మిమ్మల్ని స్త్రీ పురుషులకు ప్రవక్తగా చేశాడు కాబట్టి మేమిద్దరం మిమ్మల్ని అనుసరిస్తున్నాం మేము ఆడవాళ్ళం కనుక పరదాల చాటున ఉంటూ, మగవాళ్ళ అవసరాలను తీరుస్తూ, సంతాన బాధ్యతను నిర్వర్తిస్తూ ఉన్నాం. వారికేమో జుమా నమాజు, జనాజా నమాజు, జిహాద్‌లలో పాల్గొనే సువర్ణావకాశం ప్రసాదించబడింది. ఇంకా వారు లేనప్పుడు వారి ఆస్తిపాస్తుల్ని కని పెట్టుకొని ఉంటాం. ఆ సమయంలో వారి బాధ్యతలను కూడా మేమే నిర్వహిస్తూ ఉంటాం. మరి మాకు వారి పుణ్యంలో వాటా లభిస్తుందా? లేదా? చెప్పండి" ఇదంతా విని దైవప్రవక్త(సఅసం) సహచరుల వైపు తిరిగి విన్నారుగా, తన ధర్మం విషయంలో ఈమె చెప్పిన దానికన్నా మంచి మాటలు ఇంకెవరైనా చెప్పటం చూశారా? దైవసాక్షి మేము చూడలేదండి అన్నారు అందరూ.

"అస్మా! వెళ్ళు నీ వెంట ఉన్న స్త్రీలందరికీ తెలియజేయి. మీ మీ భర్తలతో సక్రమంగా మెలగడం, వారిని సంతోషపరిచే ప్రయత్నం చేయడం, వారి మాట వినడం ఇవన్నీ కూడా ఇప్పుడు నువ్వు ప్రస్తావించిన శ్రేష్ఠత పొందే కార్యాలన్నింటికీ సమానం" అన్నారు.

హుదైబియా ప్రయాణంలో ప్రవక్త(సఅసం) వెంట హ‌జ్రత్ సఫియా(రజి) కూడా ఉన్నారు. ఒప్పందం కారణంగా "అక్కడే తమ వెంట తీసుకొచ్చిన జంతువులను ఖుర్బానీ చేసి, తల వెంట్రుకలు గొరిగించుకోమని"ప్రవక్త (సఅసం) ముమ్మారు ఆదేశించారు. కానీ సహచరులు ఉమ్రా చేయాలన్న వారి ఆశ నీరుగారటం, వారికి పూర్తి వ్యతిరేకమైన షరతులు విధించ బడటం, తీవ్ర అసంతృప్తికి లోను చేసింది. వారి మనోభావాలు దెబ్బతిన్నాయి. తమ కల సాకారం కానందువల్ల బాధతో వారెవరు ముందడుగు వేయలేదు. ఈ విషయాన్ని ఆయన(సఅసం) తన సతీమణి సఫియా(రజి) ముందు ప్రస్తావించారు. "ప్రవక్తా (సఅసం)! వారందరూ బాధలో ఉన్నారు కనుక మీరే ముందుగా ఖుర్బానీ చేసి వెంట్రుకలు తీసివేయండి. వారు మిమ్మల్ని అనుసరిస్తారు" అని సలహా ఇచ్చారు. వెంటనే ప్రవక్త(సఅసం) దాన్ని పాటించారు. ఆ వెనువెంటనే అందరూ ఆయన్ని అనుసరించారు.

## ధర్మ ప్రచారంలో

ఇస్లాం ఆరంభకాలంలో హ‌జ్రత్ ఉమ్మె షరీక్(రజి) రహస్యంగా ఖురైష్ మహిళలకు ఇస్లాం సందేశం వినిపించేవారు. ఖురైషీ లకు ఆమె కార్యకలాపాలు తెలిసి ఆమెను మక్కా నుంచి బహిష్కరించారు.

హ‌జ్రత్ గుజయ్యా(రజి) ఎడారి ప్రాంత స్త్రీ. ఖురైషీయులు ఆమెను ఒక బిడారు వారికి అప్పగించారు. వారు ఆమెను ఒంటె మీద త్రాళ్లతో కట్టి పడేసి తీసుకెళ్లారు. మూడ్రోజుల వరకు ఆమెకు ఒక్క మెతుకు కూడా తినడానికి గానీ కనీసం త్రాగటానికి ఒక గుక్కెడు మంచినీళ్లు గానీ ఇవ్వలేదు. దీంతో ఆమె పరిస్థితి దయ నీయంగా తయారైంది. స్పృహ లేకుండా పోయింది. ఆ పరిస్థితిలో కేవలం దైవ కృప ఆమెను ఆదుకుంది. అదృశ్యంగా ఆమె నోటిలో మంచి నీళ్లు వచ్చి పడ్డాయి. ఆమె తనివితీరా తాగారు. స్పృహలోకి వచ్చారు. ఉదయం బిడారు వాళ్లు ఆమె పరిస్థితి చక్క బడటం చూసి ఆశ్చర్యపోయారు. అందు లోనూ ఆమె చేతులు కట్టబడి ఉండటం, వారి నీళ్ల పాత్రలు కూడా అలాగే బిగించబడి ఉండటం, మరింత ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ తర్వాత ఆమె సందేశం వారి హృదయాల్లో నాటుకుంటూ పోయింది. వారందరూ ఇస్లామ్ సత్యధర్మంగా గుర్తించారు.

## రాజకీయ రంగంలో

ఇస్లామీయ విప్లవ పోరాటంలో నాటి మహిళలు భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా కూడా తమ వంతు బాధ్యత నిర్వహించారు. ఏదైనా అవాంఛనీయమైన విషయాలు జరిగినా యని తెలిస్తే నేతలను సైతం నిర్భయంగా విమర్శించేవారు. హ‌జ్రత్ ఉమర్ (రజి) యువకులకు వివాహం కావడం కష్టమై పోయేలా మహర్ హద్దూ పద్దూ లేకుండా పెరిగిపోతుండటంతో ఆయన మహర్ పై పరిమితి విధిస్తున్నట్లు ఒక సమావేశంలో ప్రకటించారు. వెంటనే అక్కడికక్కడే ఖలీఫాను నిలదీసింది ఓ మహిళ. "స్వయంగా దైవగ్రంథమే స్త్రీలకు మహర్ భారీ ఎత్తున ఇవ్వడానికి అనుమతి స్తుంటే దానికి పరిమితి విధించేందుకు మీకేం అధికారం ఉంది? అని ఆమె ఖలీఫాను నిశితంగా విమర్శిం చారు. దాంతో ఆయన తన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.

## రణరంగంలో

ఉహుద్ యుద్ధంలో శత్రు సైన్యం ప్రవక్తను చుట్టుముట్టినప్పుడు ఆయన వెంట కొద్ది మంది శూరులు మాత్రమే ఉన్నారు. ఇది గమనించి హ‌జ్రత్ ఖౌలా బిన్తె హకీం(రజి), హ‌జ్రత్ ఉమ్మె అమ్మారా(రజి), ఏదో విధంగా ఆయన వద్దకు చేరుకొని ఎదురు బదురుగా నిలబడ్డారు. ప్రాణాలకు తెగించి శత్రువులతో పోరాడారు. ఖౌలా(రజి) చేతికి గాయమైంది. మరో వైపు భుజానికి తగిలిన గాయం వల్ల ఉమ్మె అమ్మారా (రజి) శరీర మంతా రక్తంతో తడిచిపోయింది. అయినా ఏ మాత్రం భయపడకుండా వీరోచితంగా పోరాడి శత్రువులను తరిమి కొట్టారు.

"ఉహుద్ సమరంలో నా కుడి ఎడమలు, ఎటుచూసినా ఉమ్మె అమ్మారా పోరాడు తూనే కనిపించింది." అని ప్రవక్త అన్నారు.


కందకం యుద్ధ సమయంలో పడతులను రక్షణ నిమిత్తం ఒక కోటలో తరలించడం జరిగింది. దానికి హ‌జ్రత్ హస్సాన్(రజి) రక్షకులుగా నియమించబడ్డారు. స్త్రీలపై దాడి చేయడానికి శత్రు సైన్యంలోని ఒక యూదుడు కోటను ఎక్కే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన ప్రవక్త (స) గారి మేనత్త హ‌జ్రత్ సఫియా(రజి), హస్సాన్ (రజి)ను జాగ్రుత పరిచారు. కానీ ఆయన తన అశక్తతను వెలిబుచ్చారు. వెంటనే ఆమె గుడారపు కర్రను ఊడబెరికి అతని నెత్తి మీద బలంగా కొట్టారు. అతని తల పగిలిపోయింది. తలను నరికి మైదా నంలో విసిరేశారామె. ఇది చూసిన శత్రు సైన్యం కోటలో కూడా సైనికులు ఉన్నారని తలచి తోక ముడిచి పారిపోయారు.

ఈ విధంగా ముస్లిం మహిళలు దైవ ధర్మాన్ని వ్యాపింపజేస్తూ ఎంతో విజ్ఞత వివేచనలతో సందర్భోచితంగా ధర్మ ప్రచార బాధ్యతలను నిర్వహించారు. విద్యా శిక్షణ రంగాల్లో తమ ప్రతిభా విశేషాలను ప్రదర్శించడంతోపాటు బయటకు వెళ్లినప్పుడు హితవులు విమర్శలతో కూడా ప్రజలకు దైవ సందేశం అందజేసే వారు. నిరంతరం ధర్మ సరిహద్దులను కాపాడుతుండేవారు. కనుక ఈనాడు కూడా ధర్మ సంస్థాపన కార్యంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా తమ సేవలను శక్తి సామర్థ్యాలను పూర్తిగా విని యోగించుకోవాల్సిన అవసరం ఉంది.

డా॥ మహ్మద్ హసన్

# అరుదైన సంస్కర్త అంబేడ్కర్

(ఏప్రిల్ - 14 అంబేడ్కర్ జయంతి సందర్భంగా)



**భారత** రాజ్యాంగ రూపకర్తగ, అఖండ మేధావిగా, దళిత వర్గాల వైతాళికుడిగా, న్యాయశాస్త్ర కోవిధుడిగా, ఆర్థికవేత్తగా నీరాజనాలు అందుకున్నారు అంబేడ్కర్.

అంబేడ్కర్ మధ్యప్రదేశ్‌లోని “మౌ” అనే గ్రామంలో 1891 ఏప్రిల్ 14న జన్మించాడు. రాంజి మాలోజి సక్పాల్ భీమాభాయి దంపతులకు చివరి సంతానం. “మహర్” కులానికి చెందినవాడు.

చిన్న వయస్సులో సతారలోని పాఠశాలలో చదువుతున్నప్పుడు ఎన్నో చేదు అనుభవాలు ఎదుర్కొన్నాడు. పాఠశాలలో అగ్రకులాల పిల్లలతో కాకుండా ఒక మూలకు కూర్చోబెట్టేవారు. ఆఖరికి ఉపాధ్యాయులు కూడా అతని పుస్తకాలు ముట్టుకునేవారు కాదు. చదువులో చురుకైన ‘భీమ్ రావు’ను “అంబేడ్కర్” అనే పేరు గల ఉపాధ్యాయుడు ప్రోత్సహించి ఆదరించాడు. అప్పటి నుండి ఇతను “అంబేడ్కర్”గా పేరు మార్చుకున్నాడు.

హిందు మతం తనను “అంటరాని” వాడిగా ముద్రవేసిందని నిచ్చెనమెట్ల వ్యవస్థపై తనకు నమ్మకం లేదని బౌద్ధ మతంను 1956లో వేల మంది సాక్షిగా స్వీకరించారు. ప్రపంచాన్ని ఆధునిక వైజ్ఞానిక సాంకేతిక దృక్పథం వైపు మార్చడంలో విద్యకు గల ప్రాముఖ్యతను చదువుకునే దశలోనే గ్రహించాడు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కొరకు అంబేడ్కర్ అనేక గ్రంథాలు రచించాడు. అమెరికాలో ఉన్నప్పుడు భారతదేశంలో కుల, మత వ్యవస్థ గురించి రాశారు. 1919లో ఎన్నికల సంస్కరణ సంఘం ముందు దళిత వర్గాలకు రాజకీయ హక్కులుండాలని సూచించాడు. 1920లో “మూక్ నాయక్” అనే మరాఠీ పక్షపత్రికను ప్రారంభించాడు. ఆనాటి కొల్లాపూర్ సంస్థాన రాజైన “సాహు మహారాజ్” ఈ పత్రికకు ఆర్థిక సహాయం అందించి తన ఉదారత చాటుకున్నాడు. ఈ పత్రికలోని రచనలతో నాటి సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసి తన సామాజిక వర్గం వారిని చైతన్య పరిచాడు. అలాగే బ్రిటీష్ మ్యూజియంలో గల గ్రంథాలయంలోని అన్ని పుస్తకాలను చదివింది ప్రపంచంలో ముగ్గురే అందులో ఒకరు “కారల్ మార్క్స్”, రెండవవారు “ఐవర్ జెన్నింగ్”, మూడవ వ్యక్తి “అంబేడ్కర్”. ప్రపంచంలో ఏ పుస్తకం ఎక్కడ దొరుకుతుందో తెలుసుకోవాలంటే అంబేడ్కర్ నే అడగాలని ఆ రోజుల్లో అతని స్నేహితులు అనే వారంటే ఎంత మేధస్సు కలవాడో అర్థం చేసుకోవచ్చు.

మన దేశంలోని వ్యవసాయ, ఆర్థిక విధాన సమస్యల గూర్చి “భారదేశంలో చిన్న కమతాలు” అనే వ్యాసంలో చర్చించాడు. “బెర్ట్రాండ్ రస్సెల్” రాసిన “సమాజ పునర్నిర్మాణ సూత్రాలు” అనే పుస్తకాన్ని సమీక్షిస్తూ అంబేడ్కర్ ఆస్తి వ్యవస్థ విశ్లేషణ గురించి ప్రస్తావించాడు. భారతదేశ జాతీయ ఆదాయం చారిత్రక, విశ్లేషణా

త్మక అధ్యయనం" అనే అంశంపై పరిశోధనకు కొలంబియా విశ్వవిద్యాలయం అంబేద్కర్‌కు "డాక్టరేట్" నిచ్చింది. దీనిని "బరోడా మహారాజుకు" అంకితం ఇచ్చాడు. అదేవిధంగా భారతదేశంలో కులాలు వాటి పుట్టుక అభివృద్ధి" అనే పరిశోధన పత్రం అంబేద్కర్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చి పెట్టింది. భారతదేశంలోని "కుల వ్యవస్థను" మొదటిసారిగా అంతర్జాతీయ సమాజానికి పరిచయం చేసిన గొప్ప పరిశోధన అది. తన పరిశోధనలో అనేక ఉదాహరణలతో వివరించాడు.

### సామాజిక విప్లవవాదిగా

1924 జులై 20న ఏర్పాటు చేసిన బహిష్కృత హితకారిణి సభ, సైమన్ కమిషన్ (1927) ముందు, దళితుల కోసం ప్రత్యేక నియోజకవర్గాలు కావాలనే డిమాండ్ చేశారు. లండన్‌లో 1930, 1931, 1932లో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాలలో కుల, మత, జాతి వివక్షత లేని రాజ్యాంగం కావాలని నాటి బ్రిటిష్ ప్రభుత్వం వద్ద తన గళం వినిపించాడు. కార్మిక నాయకుడిగా "లేబర్ పార్టీ" స్థాపకుడిగా లోక్ సభలో ఆయన చేసిన ప్రసంగాలు చిరస్మరణీయం.

తను జీవితంలో అనుభవించిన ఆనాటి సామాజిక సమస్యలను దృష్టిలో పెట్టుకొని, రాజ్యాంగ రచన ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా తరతరాలుగా వస్తున్న అసమానతలను రూపుమాపి భారత పౌరులందరికి రాజ్యాంగపరంగా సమానతను కల్పించాలని నొక్కి చెప్పాడు. భారత రాజ్యాంగం ద్వారా దళితులకు ఆర్థిక, రాజకీయపరమైన హక్కులను సంక్రమింప చేయడంలో అంబేద్కర్ ప్రముఖ పాత్ర వహించారు.

## దివ్యఖుర్ఆన్ సర్వమానవాళికి మార్గదర్శకం- ఇఫ్తార్ సమావేశంలో వక్తలు





దివ్య ఖుర్ఆన్ సర్వ మానవాళి మార్గదర్శకత్వం కోసం అవతరించిందని జమాఅతె ఇస్లామీ హింద్ కడప మహిళా విభాగం అధ్యక్షురాలు మొహతరమా తాహిరా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సలహామండలి సభ్యులు మొహతరమా అమీరున్నిసా, ప్రొద్దుటూరు మహిళా విభాగం నాయకురాలు మొహతరమా ఆయిషాలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రమజాన్ మాసం సందర్భంగా జమాఅతె ఇస్లామీ హింద్ కడప శాఖ మహిళా విభాగం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ సమావేశంలో మొహతరమా ఆయిషా రమజాన్ మాసం విశిష్టతను, ఉపవాసాల లక్ష్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విందుకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

యువతరానికి విప్లవనాదం
చేతన వాదం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ప్రళయ దినం సంభవించిన రోజున...

- ముహమ్మద్ వహీదుద్దీన్

**ప్రళయదినం** సంభవించిన రోజున ఈ ప్రపంచం అంతమై పోతుందని అంతిమ దివ్య ఖుర్ఆన్ చెబుతుంది. దీని తరువాత మరో కొత్త ప్రపంచం ఉనికిలోకి వస్తుంది. మానవులందరూ అక్కడ అల్లాహ్ ముందు హాజరవుతారు. ప్రపంచంలో మంచి పనులు చేసిన వారికి బహుమానం, చెడు కార్యాలకు పాల్పడిన వారికి కఠిన దండన విధిస్తాడు అల్లాహ్. అక్కడ శిక్ష అయినా, బహుమానం అయినా శాశ్వతమైనవి.

### ప్రళయదినం గురించి ఖుర్ఆన్ చెప్పిన విశేషాలు

దైవంపై విశ్వాసమున్నప్పుడే ప్రళయంపై విశ్వాసం పరిపూర్ణం అవుతుంది. ప్రళయదినం పట్ల విశ్వాసం మనిషి మస్తిష్కంలో నాటుకుపోతే మానవ జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రళయం పట్ల విశ్వాసం మానవుల నడవడికి, జీవన గమనానికి పవిత్రమైన దశ, దిశలను నిర్దేశిస్తుంది. మంచిని ప్రేమించేవారుగా, ప్రోత్సహించేవారుగా, చెడును అసహ్యించుకునే వారుగా, దాన్ని నిరోధించేవారుగా తీర్చిదిద్దుతుంది. మానవుల్లో దైవభీతిని, దైవభక్తిని, పరలోక చింతనను పాదుకొల్పుతుంది. ప్రళయం పట్ల నమ్మకం మానవులను దైవాదేశాలకు కట్టుబడే వారుగా, సత్యధర్మ పథంలో స్థైర్యంగా నడిచేవారుగా మలుస్తుంది.

### కర్మల పత్రం

ప్రళయదినాన ప్రతి మనిషి చేతిలో అతడి కర్మల పత్రం ఉంటుంది. అతడు చేసిన చిన్నా పెద్ద పనులు, మంచి చెడ్డ పనులు, పాప పుణ్యాలు ఆ పత్రంలో రికార్డు అయి ఉంటాయి. దైవభీతితో జీవితం గడిపిన పుణ్యాత్ములకు ఆ రోజు వారి కర్మల పత్రం వారి కుడి చేతికి ఇస్తారు. పాపాత్ములకు ఎడమ చేతికి ఇస్తారు. లెక్కల పత్రం కుడి చేతికి అందినవారు ఆ రోజు అమితంగా ఆనందిస్తారు. ఎడమ చేతికి లెక్కల పత్రం అందినవారు దౌర్భాగ్యులు.


### పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలుపబడింది

మీరు హాజరుపరచబడే ప్రళయదినాన మీ రహస్యాలేవీ దాగి ఉండవు. అప్పుడు కర్మల పత్రం కుడిచేతిలో అందుకున్న వ్యక్తి చూడండి నా కర్మల పత్రాన్ని చదవండి నా లెక్క నాకు తప్పక లభిస్తుందని నేను అనుకుంటూ ఉండేవాడిని అంటాడు. అతడు తన ఇష్టమైన భోగభాగ్యాలలో ఓలలాడుతూ ఉంటాడు. అత్యున్నత స్వర్గవనాల్లో విహరిస్తాడు. అక్కడ వారు కోరుకున్నది దొరుకుతుంది. హాయిగా తినండి, త్రాగండి. ప్రపంచ జీవితంలో మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా

ఎడమ చేతితో లెక్కల పత్రం అందుకున్న వ్యక్తి అయ్యో! ఈ కర్మల పత్రం నాకు ఇవ్వకుండా ఉంటే, నా లెక్క నాకు తెలియ కుండా ఉంటే ఎంత బాగుండును. నాకు ప్రాపంచిక మరణమే అంతిమం అయివుంటే ఎంత బాగుండేది. నా ఆస్తిపాస్తులు నాకు ఈ రోజు పనికిరాకుండా పోయాయే. నా అధికారమూ నన్ను రక్షించలేదే అని వాపోతాడు. అప్పుడు ఇలాంటి ఆజ్ఞ వస్తుంది. అతడ్ని పట్టుకుని మెడకు కంఠపాశం బిగించి నరకంలో పడవేయండి. సర్వోన్నతుడు మహోన్నతుడైన దైవాన్ని ఇతడు విశ్వసించలేదు. నిరుపేదలకు అన్నం పెట్టడం కాని, పెట్టమని ప్రోత్సహించడం కాని చేసేవాడు కాదు. కాబట్టి ఇక్కడి అతడి దుఃఖాల్లో పాలుపంచుకునే స్నేహితుడు ఎవరూ లేడు. అతడిక్కడ గాయాల కడుగు తప్ప తినడానికి, తాగడానికి మరేమీ లేదు. దాన్ని పాపాత్ములు తప్ప మరెవ్వరూ తినరు. (అల్ హాఖ్ఖహ్ 18-38)

దైవాన్ని, పరలోకాన్ని, ప్రళయదినాన్ని విశ్వసించని వారి కోసం ఇలాంటి అనేక హెచ్చరికలున్నాయి దివ్య ఖుర్ఆన్‌లో. మానవుల్లో ప్రళయం పట్ల విశ్వాసం దృఢంగా నాటుకుపోతే ఇప్పుడు మనం ప్రపంచవ్యాప్తంగా చూస్తున్న అన్ని చెడులూ క్రమంగా అంతరించిపోతాయి.

**తుదిగీటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**